# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక 2

పేజీలు 40

అక్టోబర్ 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ..................................3

అమ్మమాట..........................................5

శ్రీదుర్గా స్తుతి .......................................7

బంగారు క్షణాలు ..................................9

సన్నిధిలో సంభాషణ ...............................11

యోగవాశిష్ఠము ....................................13

సత్సంగ సౌరభం ..................................15

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.......................17

పరిప్రశ్నేన సేవయా ..............................19

అభినవ చందన మందార మాల ............. 21

గీతాధ్యయనమ్.....................................22

శ్రీకృష్ణకర్ణామృతము................................24

కర్మయోగము ......................................26

అమృతబిన్దూపనిషత్ ............................28

మహాభారత నీతి చంద్రిక.......................29

అమెరికా పర్యటనలో శ్రీమాతాజీ బోధ........31

సత్సంగామృతం....................................33

ఇంద్రకీలాద్రిపై వెలసిన మహిషాసుర మర్దిని శ్రీదుర్గామాత ..........................35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

సపర్యగాచ్ఛుక్ర మకాయమవ్రణమస్నావిరగ్ం ।
శుద్ధమపాప విద్ధమ్ కవిర్మనీషీ పరిభూః ।
స్వయంభూః యథాతథ్యతోఽ_ర్థాన్ ।
వ్యదధాచ్ఛాశాశ్వతీభ్యః సమాభ్యః ॥

(ఈశావాస్యోపనిషత్ 8 శ్లో॥)

నేను అనే వునికి నిజ ఆత్మానుభూతి. ఆత్మవస్తువు తనకై తానున్నది. అది వేరొకరి నుండి వుద్భవించినది కాదు. దాని నుండి వేరొకటి వుద్భవించే ప్రసక్తి లేదు కదా! కాబట్టి స్వయంభూ.

నేనుకు క్రియ లేదు. ఇంద్రియ చేష్టలు లేవు. ద్వంద్వములు లేవు. అభిమాన అహంకారములు లేవు. దేహభావాలలోనూ, యింద్రియ కార్యకలాపాలలోనూ, అభిమాన అహంకార భావాలయందునూ 'నేను' లేకపోతే తినటము అనే క్రియలేదు. నేను అనే ఆత్మ వస్తువునకు స్థూల సూక్ష్మ కారణ రూపాలు లేవు. దేహేంద్రియాలదులతో నిర్వహింపబడే యే క్రియకైనా తోడ్పడే కండరాలు గాని, జవసత్వాలుగాని నేనుకు లేవు. తినటం అనే క్రియకు కారణమైన సంకల్పంగాని, వృత్తిగాని లేక తినటానికి తోడ్పడే దేహము, రసేంద్రియముగాని లేదా తినటం ద్వారా కల్గే ఫలమైన దుఃఖముగాని, సుఖంగానీ నేనుకు లేవు. దేహము యింద్రియాలు అనారోగ్యానికి గురి కావచ్చు, హాని జరుగవచ్చు యేదైనా బాధ కలుగవపచ్చు. ఇవేవీ నేనుకు లేవు.

నేను శుద్ధమైనది, శాశ్వతమైనది. క్రియ మాత్రం చంచలమైనది, అశాశ్వతమైనది. ఇంద్రియాలకుగాని, దేహానికిగాని, క్రియకుగాని తన దోషము తెలియదు. ఆత్మ భావన తెలియదు. నేను అనే భావనే జ్ఞానం. అదే నిజమైన పాండిత్యము.

నరుని తన నిజరూప స్థితియైన నేను సత్యమై వుండగా కర్మబంధ స్థితికి ఎలా దిగజారిపోయాడో విచారించుకోవాలని హెచ్చరిక చేస్తున్నదీ శ్లోకం.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "జ్ఞాని అంటే ఎవరైనా ఆయనను గుర్తించగల్గుతారా? ఆయనకూడా అందరి వలెనే మానవాకారంలో ఉంటాడు. పుష్పము సుగంధము దాచినా దాగుతుందా? జ్ఞానిగా నటించాలన్నా సాధ్యపడదు కదా! పులితోలు కప్పకున్నంత మాత్రంచేత నక్క పులి అనిపించుకోలేదు గదా! సామాన్య మానవుడు మాతృగర్భంలో శరీర ధారణ చేసిన నాలుగు మాసముల వరకు గర్భనరకాన్ని అనుభవిస్తూ పూర్వజన్మస్మృతి కల్గియుంటాడు. అప్పడు 'స్వామీ నీ ధ్యానాన్ని మరచాను నాకు ఈ గర్భ నరకము నుండి విముక్తిని ప్రసాదించు' అని ప్రార్థిస్తాడు. మాతృగర్భము నుండి ఇవతల పడగానే మాయ ఆవరిస్తుంది. జన్మించి కన్ను తెరవగానే ప్రాపంచిక ఆకర్షణలకు గురైపోతాడు. జన్మ జన్మలనుంచి ఆర్జించిన కర్మఫలాన్ని అనుభవిస్తాడు. కాని జ్ఞాని వేరుగా ఉంటాడు. జ్ఞాని పరమాత్ముని ఒడిలో బిడ్డయై సమాధిస్థితిలో హాయిని, ఆనందాన్ని పొందుతాడు.



జ్ఞాని కన్ను తెరచి చూసి సర్వ ప్రకృతిలో ఆత్మనే దర్శిస్తాడు. ఆయన హృదయంలో మలినము ఉండదు. అహంకారము ఉండదు. ఈర్ష అసూయలకు స్థానములేదు సంకల్పములు విషయ వాసనలకు హృదయంలో స్థానము ఉండదు. హృదయం అంతా ప్రేమతో నిండి వుంటుంది. జ్ఞాని స్థూల, సూక్ష్మ కారణ దేహస్థితులన్నింటిలో తన నిజరూప దర్శనాన్ని పొందుతాడు.

జ్ఞాని సాధారణ మానవుని వలె జీవిస్తూ నిత్యకర్మలు నిర్వహిస్తూ నిరాడంబరంగా ఉంటాడు. అయితే జ్ఞానికి రాగద్వేషాలుగాని, సంసార తాపత్రయం గాని ఉండవు. కరెంటు ప్రవహించే రాగి తీగె, సాధారణ రాగి తీగ ఒకే రీతిగా ఉంటాయి కదా! జ్ఞాని సంసారంలో ఉన్నా దానిలో నిస్సారమైన దానిని త్యజించి సారవంతమైన దానినే దర్శిస్తూ ఉంటాడు. బియ్యపు గింజను నీటిలో నానబెట్టినా ఏమవుతుంది? అది అంకురించదు కదా! జ్ఞాని అందరి మధ్య సంచరించినా ఆయన

మనస్సు ఆత్మ యందే రమిస్తూ ఉంటుంది. జ్ఞానికి కూడ సామాన్య మానవుని వలె బాల్యము, యవ్వనము కౌమారము, వార్ధక్యము అనేవి ఉంటాయి. అయితే అవి దేహ పరిణామాన్ని తెలిపేవి మాత్రంకాదు.

జ్ఞానికి బాల్యదశ అంటే ఆయన బాలకుని వలె చిలిపిగా వుండడు. యవ్వన దశలో పటిష్ఠమైన సాధనచేస్తూ సాధకులకు సాధనా మార్గాన్ని తెలియజేస్తారు. ఆయన కౌమార వృద్ధాప్యదశలలో జ్ఞానబోధ చేస్తూ తనను ఆశ్రయించిన శిష్యులను ఉద్ధరిస్తారు.

జ్ఞాని కూడా సాధారణ మానవుని వలె దేహ బాధకు గురికావచ్చు. కాని జ్ఞాని ఆ బాధను అనుభవించడు. ఎందువలెనంటే వారికి దేహభావన ఉండదు. జ్ఞాని నిత్యకృత్యాలను నిర్వహిస్తూ సహజ సమాధి స్థితిలో ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. నీరులేని చెరువులో చేపలు, జంతువులు చేరవు కదా! ధనములేని వారి యింటికీ వారి బంధువర్గము ఎవరైనా వస్తారా! అలాగే దేహభావనలేని జ్ఞానికి సంకల్పాలు వికల్పాలు దగ్గరకు చేరవుకదా!

జ్ఞాని అశరీరి కాబట్టి ఆయన శరీరధారణ చేసి ఉన్నా శరీరమునకు ఉండే వికారాలు, సుఖ దుఃఖాలు, దూషణ భూషణలు వుండవు. జ్ఞాని సంఘంలో ఉన్నా నిస్సంగుడు. నీటిలో ఉన్న చేప నీటిని శుద్ధి చేసినట్లు నరజలధిలో ఉన్న జ్ఞాని జీవరాశుల మధ్య నివశిస్తూ వారి హృదయాల్లో ఉన్న మలినాన్ని తొలగిస్తాడు.

జ్ఞానిది నిశ్శబ్ధస్థితి. ఆయన మనస్సు ప్రణవనాదంలో లయించి ఉంటుంది. ఎక్కడ శబ్దం ఉంటుందో అక్కడ అశాంతి బయలు దేరుతుంది. ఎక్కడ అశాంతి ప్రబలుతుందో అక్కడ సంకల్పం బయలు దేరుతుంది. జ్ఞాని దేహము చలనముతో కూడి ఉన్నా మనస్సు చలించదు. కాని సామాన్య మానవుడి దేహం స్థిరంగా పద్మాసనంలో ఉండవచ్చు కాని మనస్సు మాత్రం ఎక్కడెక్కడో సంచరిస్తూ ఉంటుంది.

జ్ఞానిది అభేద దృష్టి ఆయన పిపీల కాది బ్రహ్మ పర్యంతము సమదృష్టితో చూస్తారు. ఆయన కాలాతీతుడు జనన మరణము లేనివాడు ఆయన తన దేహాన్ని స్వచ్ఛందంగా త్యాగం చేస్తారు. అటువంటి జ్ఞాని అభయహస్త కిరణములలో జీవించే సాధకునికి భయమేముంది?" అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

## గోప్త్రీ - గోవింద రూపిణీ

" కృష్ణ తత్వాన్ని గుర్తింపజేసేవారు గురుదేవులు. ఈనాడు శ్రీగురుదేవుల రూపంలో వచ్చి వున్నారని, మనమందరం నమ్మి వున్నాం. సాధకులకి యింకా యింకా, యెన్నెన్ని విధాలుగా చెబితే గుర్తిస్తారో, అన్నింటిలోను అంతటా తామే నిండివున్నామని చాటడానికా అన్నట్లు , ఈ సవంత్సరం కృష్ణాష్టమి మొదటిరోజు 'ఆచార్యదినోత్సవము' వచ్చింది; మూడవ రోజు 'శ్రీగురుదశమి' వచ్చింది. అయితే అష్టమి, నవమి తరువాత వచ్చేది దశమే కదండీ? అందులో గొప్పతనమేమిటి? అని మీరనవచ్చు. కాని కొంచెం లోతుకి వెళ్ళి విచారణ చేస్తే, 'నేను లేకపోతే నీకు జీవితం లేదురా' అని శ్రీగురు దేవులు ప్రతిరోజూ, ప్రతిక్షణమూ మనకి గురుతుకు తెస్తున్నారు. అందుకే సత్సంగమనేది చాలా అవసరం. ఇలా అన్నామని, ఏదో పెద్ద పెద్ద ఆధ్యాత్మిక విషయాలే మాట్లాడుకోవాలని కాదు. మనం శ్రీగురుదేవులతో గడిపిన మధుర క్షణలాని గుర్తుకు తెచ్చుకుంటే చాలు. ఇతరులతో కలసినప్పుడు యితరేతర విషయాలు మాట్లాడకూడదు. సద్విషయం గురించే మాట్లాడాలి.

మా చిన్నతనంలో ముంజవరపుకొట్టులో శివరాత్రి జరిగేది. అప్పుడు రెండు మూడు తెప్పలు వరుసగా కట్టి, దానిమీద శ్రీగురుదేవుల కోసమని సింహాసనం యేర్పాటు చేసేవారు. ఒకొక్కసారి స్వామివారు ఆ సింహాసనం వేసిన తెప్పను వదలి, రెండోదానిమీద కూర్చునేవారు. అందుకని అందులో మరోక ఆసనం వేసి వుంచేవారు. ముందు సత్సంగం తరువాత గురుపూజ జరిగేది. చిన్నపిల్లలం కనుక నిద్రపోయేవాళ్ళం. అల్లరి చేసేవాళ్ళం. అది అల్లరి అని అప్పుడు తెలియలేదు. ఒక అవగాహన యేర్పడ్డాక యిప్పుడు తెలిసింది. అది అల్లరి అని.

శ్రీగురుదేవులు కొందరి ముఖస్తుగా కొన్ని రత్నాలు వెదజల్లుతారు. వాటిని మనం యేరుకుని ధరించాలి. ఈ చెవులు కలిగినందుకు సత్సంగం శ్రవణం చేయడమే ఆభరణాలు. చలించే చిత్తానికి యేకాగ్రత కలగడానికి మనస్సు సహకరించాలి. శ్రీగురుదేవులు మన ఆరాధ్యదైవం. వారు చెబితేనే మనకీ విషయాలన్నీ తెలిశాయి. ఆశ్రమవాసం చేస్తున్నా కూడా మనస్సులో యెన్నో అలజడులు వస్తున్నాయి. ఎందుకని? మనస్స

యెందులో వూరివుంటుందో అదే వాసన వస్తుంది. నిజమైన సత్సంగీయుడు యెవరు అంటే, యితర విషయాలు వినిపించినప్పుడు అక్కడి నుండి లేచి వెళ్ళి పోయినవాడు. మౌనం పాటించాలి.

గోపబాలురు, గోపికలు నిరంతరం కృష్ణ ధ్యాసలోనే వుండేవారు. వారికి దేహదృష్టి అనేది లేదు. మనకి అది యెంతవరకూ పోయిందని ప్రశ్నించుకోవాలి. వారు ఒకరినొకరు కృష్ణా, కృష్ణా అనే అనుకునేవారు. వారికి ఆయనే కనిపించేవాడు. పిలిస్తే పలుకుతాడాయన. ఆనాడు ద్రౌపది పిలిస్తే రాలేదా? ఆవిడ యెప్పుడు పిలుస్తుందా వెళ్ళాలని యెదురు చూశాడాయన. 'ఆయన నిజంగా దేవుడైతే పిలిస్తేనే వెడతాడా?' పిలవని పేరంటానికి వెళ్ళకూడదని కూడా అన్నది మీరేగా మరి! అన్ని అడ్లు మనవే. అన్ని లోపాలు మనవే. 'దేవుడెక్కడున్నాడు?' అనేవారికి 'దేవుడు యెక్కడ లేడు?' అన్న మరోప్రశ్నే జవాబు. 'వడ్లగింజలో బియ్యపు గింజ' అంతే!

కృష్ణతత్వాన్ని గుర్తింపజేసేవారు శ్రీగురుదేవులు. అందుకనేనేమో స్వామి మనకీ మహామంత్రాన్ని అందించారు; 'ఓం కృష్ణ ఓంకృష్ణ కృష్ణాయ నమః'; 'శ్యామ సుందర మదన మోహన కృష్ణాయ నమః' అని. ఏ పని చేస్తున్నా యిది జపించండి చాలు. మీరు చేసే కర్మ అకర్మ అవుతుంది అని శ్రీవారు శెలవిచ్చారు. సాధన విషయం చాలా గోప్యంగా వుంచాలని హెచ్చరించారు. మన సాధన గురించి పదిమందికి చెబితే, వారు మనని 'నువ్వు చాలా బాగా ధ్యానం చేస్తావుట కదమ్మా!' అని పొగడటం మొదలు పెడితే, సాధన అడుగంటిపోతుంది. మనలో అహంకారం పెరిగి మనం పతనమయిపోతాం. పట్టుదలతో సాధన చేయాలి. అప్పుడు అనుకున్నది సాధించగలుగుతావు.

నిరాశ, నిస్పృహలని దరికిరానీయకండి. hactగా వుండాలనేవారు శ్రీగురు దేవులు. అంటే ఉత్సాహంగా, చురుకుగా వుండాలి. ఆ కృష్ణ స్వరూపాన్నే యిక 'కాళీ' స్వరూపంగా ఆరాధించుకోవడానికి మనకి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చేశాయి. అమ్మే గోవింద రూపిణి, బ్రహ్మరూపిణి, శివస్వరూపిణి. ఆదిమధ్యాంత రహితమైన అనంతశక్తి స్వరూపిణి అమ్మ. అమ్మ నామపారాయణ ప్రీత. కనుక నిరంతరం అమ్మ నామస్మరణలో, అమ్మ ధ్యానంలో, అమ్మ సంకీర్తనలో, అమ్మ బోధామృతంలో మనమందరం ఓలలాడదాం. అట్టి అఖండ భక్తిజ్ఞానాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక!!

# శ్రీ దుర్గా స్తుతి

సంకలనం-రమణ ప్రసాద్



ఓం జ్ఞానినామపి చేతాంసి దేవీ భగవతీ హి సా ।
బలదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి ॥

ఓ భగవతీ దేవీ! జ్ఞానులందరూ నీ అంశలే. ఓ మహామాయా! అయినా నీవు వారి మనస్సులను సైతము నీ బలిమిచే ఆకర్షించి మోహాధీనులుగా చేయుచున్నావు.

దుర్గే స్మృతా హరసి భీతిమశేషజంతోః
స్వస్థైః స్మృతా మతి మతీవ శుభాం దదాసి
దారిద్ర్య దుఃఖ భయ హారిణి కా త్వదన్యా
సర్వోపకారకరణాయ సదార్ద్రచిత్తా ॥

దుర్గా! అనే శబ్దమును ఉచ్చరించిన మాత్రము చేతనే వారి భయములను పోగొట్టెదవు. నిన్ను హృదయమందు నిలుపుకుని ధ్యానించు వారికి సకల శుభములను చేకూర్చెదవు. దుర్గామాతా! నిన్ను స్మరించు వారి దారిద్ర్యము, సంకటములు, రోగములు, భయము మొదలైన సరసంకటములను తొలగించగలవారు నీవు తప్ప ఎవరున్నారు?. ఎల్లప్పుడును దయార్ద్రమైన చిత్తము కలదానవు. శత్రువులు, మిత్రులు, అను భేదము లేక సర్వులకు వుపకార మొనర్చ గలదానవు నీవే తల్లీ!

సర్వ మంగళ మాంగల్యే! శివే! సర్వార్థ సాధికే ।
శరణ్యే త్ర్యంబకే గౌరి! నారాయణి! నమోస్తుతే ॥

మంగళమును గూర్చు సర్వ వస్తువుల మాంగల్యమునకు కారణభూతురాలైన తల్లీ! శక్తి స్వరూపమైన దేవీ! ధర్మార్థ కామ మోక్షములను సర్వ ప్రయోజన ములను సిద్ధింపచేయుదానా! ఎట్టి ఆపదల యందును స్మరించి నంతనే శరణము నిచ్చు దానా! సోమ సూర్యాగ్నులను  కన్నులు కలదానా! నారాయణీ! నీకు నమస్కారము.

శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే ।
సర్వస్యార్తి హరే దేవి, నారాయణి నమోస్తుతే ॥

శరణాగతులైన దీనులను, ఆర్తులను రక్షించుటయే వ్రతముగా గలదానా! ప్రాణ, భయ, రోగ భయ,దారిద్ర్య భయార్తులైన వారి యార్తులను హరించుదానా! లక్ష్మీ స్వరూపిణీ! నీకు నమస్కారము.

సర్వ స్వరూపే ! సర్వేశే! సర్వ శక్తి సమన్వితే ।
భయేభ్యస్త్రాహినోదేవి! దుర్గే! దేవి! నమోస్తుతే॥

చరాచరాత్మకమైన విశ్వము రూపముగా గలదానా! సర్వమునకు ఈశ్వరీ! సర్వ శక్తులు గలదానా! దైత్యాది భయములను పోగొట్టి మమ్ము కాపాడు దేవీ!దుర్గా! నీకు నమస్కారము.

రోగానశేషానపహంసి తుష్టా ।రుష్టాతుకామాన్ సకలానభీష్టాన్ ।
త్వామాశ్రితానాం నవిపన్నరాణాం ।త్వామాశ్రితాహ్యాశ్రయతాం ప్రయాంతి ॥

అమ్మా! నిన్ను కొలుచువారి భక్తికి సంతుష్టి చెంది, వారి భౌతిక రోగములను, యాధ్యాత్మిక రోగములను తొలగింతువు. దుర్జనుల యెడల కోపించి వారి మనోరథములను తీరకుండా చేసెదవు. నిన్ను ఆశ్రయించిన వారి విపత్తులను తొలగించెదవు. నిన్ను శరణు జొచ్చితిని. నా అంత్యకాలంలో నీ ఆశ్రయమునే పొందునట్లు చేయి తల్లీ!

సర్వబాధా ప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరీ ।
ఏవమేవ త్వయా కార్యం అస్మద్వైరి వినాశనమ్ ॥

అమ్మా! మూడులోకములను పాలించే తల్లీ! మా శత్రువులను నాశనమొనర్చి, మాకుగల సర్వబాధలను తొలగించితివి. అట్లే మునుముందును చేసి మమ్ము రక్షించమని ప్రార్థిస్తున్నాము తల్లీ!

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

(గత సంచిక తరువాయి)

శ్రీబాబు :

తాను పెట్టిన పరీక్షలకి నిలబడి, నెగ్గిన శిష్యుడిని చూసి మహదానందంతో గురుమూర్తి అంటున్న మాటలవి! 'నాయనా! నేను నిన్ను తిట్టాను, కొట్టాను, యెన్నో శ్రమలకు గురిచేశాను. నువ్వెంత మొర పెట్టినా సరే నీ మాట నేను వినిపించుకోలేదు. ఛీ పో, అని వెళ్ళ గొట్టాను. నిన్ను యిన్ని కష్టాలు పెట్టానంటే, నువ్వంటే గిట్టకకాదు నాయనా! నీ మనసు తెలియక యిలా చేశాననుకుంటున్నావేమో కాదు, కాదు. నీ మనసు నాకు తెలియకా కాదు, నిన్ను నొప్పించాలనే వుద్దేశ్యమూ నాకు లేదు. నీ మీద నాకు కోపమూ లేదు. రోజులతరబడి నీకు నా దర్శనము యివ్వలేదు, నిన్ను పలుకరించలేదు. నువ్వు యెంత మాట్లాడినా నిన్ను కన్నెత్తి కూడా చూడలేదు. నువ్వు కుయ్యో! మొర్రో! అని గోలపెట్టినా కూడా నేను వినిపించుకోలేదు. నువ్వు వెక్కి వెక్కి యేడుస్తూ పొర్లుతున్నా కూడా నిన్ను చూడలేదు.

ఇదంతా యెందుకనుకుంటున్నావు? నీ మాద నాకు కోపమా లేక ద్వేషమా? కాదు నాయనా! నా బిడ్డ అయిన నీ మీద నాకు కోపమూ ద్వేషమూ లేవు. తన బిడ్డ అభివృద్ధిలోకి రావాలనేగా యే తండ్రియైనా కోరుకునేది. నువ్వు నీ దేహాన్నిచ్చిన తండ్రిని యెప్పుడైనా వదులుతావా? అతడు నిన్ను తిట్టినా కొట్టినా నా తండ్రే అని అతన్ని అంటిపెట్టుకుని వుంటావు. మరి నశించిపోయే యీ పాంచభౌతిక శరీరమునకు కారకుడైన యీ కర్మ తండ్రిపైనే అంత ప్రేమ వుంటే, ఆ తండ్రికి కర్మ పుత్రుడవైనా నీ మీద అంత ప్రేమ వుంటే, నీకు జ్ఞానదేహాన్నిచ్చి, జనన మరణ రహితునిగా చేసే ఆత్మవిద్యను ప్రసాదించే ఆచార్యదేవుని మీద నీకెంత ప్రేమానురాగాలు, భక్తివిశ్వాసాలు వుండాలి? కర్మపుత్రులపై కర్మతల్లిదండ్రులకే అంతప్రేమ వుంటే, జగన్మాత జగత్పిత అయిన ఆ భగవంతుడికి (ఆచార్యదేవుడికి) తమ బిడ్డలపై యెంత ప్రేమ వుండాలి? ఆ గురుమూర్తి ప్రేమ మీ ఊహకి అందుతుందా?

అత్యంత దుర్లభమైన ఆత్మవిద్య నీకిద్దామనుకుంటున్నాను. మరి

దానికి నీవు అర్హుడవవునా, కాదా అని పరీక్షించకుండ యిచ్చివేస్తే, అది వ్యర్థమైపోతుంది. గురూపదేశం వ్యర్థం కారాదు. గురుదేవుడు తానీయ బోయే లక్ష్యార్థానికి ఆ శిష్యుడు తగిన పాత్ర అవునా, కాదా అని పరీక్షించి, పరిశీలించితేనే తప్ప ఉపదేశమీయరాదు.

అందుకని నీ పట్టుదల, వైరాగ్యము యెంత గట్టివో తెలుసుకుందామని యిన్ని పరీక్షలకు గురిచేశాను. నీవు నన్ను మంత్రమిమ్మని త్రికరణ శుద్ధిగా అడిగావో, లేక 'యీయన మంత్రం యిచ్చేస్తే చాలులే' అనే తేలిక భావనతో అడిగావో తెలుసుకుందామని యిన్ని కష్టాలు పెట్టాను. ఎన్ని కష్టాలు, యీతి బాధలు వచ్చినా, నువ్వు నేనీయబోయే లక్ష్యార్థం మీదనే మనస్సు పెట్టి నిలబడతావా, లేక యీ కష్టాలు పడలేక తిరిగి ప్రపంచ వ్యామోహాలలో పడిపోయి లక్ష్యార్థాన్ని నిర్లక్ష్యం చేస్తావా అని తెలుసు కోవాలని యిన్ని విధాలుగా పరీక్షించాను. నీ వైరాగ్యం అర్జునునిలాగా దృఢమైనదా లేక ఉత్తరకుమారుని లాంటిదా అని పరీక్షించాను. కడకు నువ్వే గెలిచావురా నాయనా! నా కన్నతండ్రీ! నీ పట్టుదల, ఓపిక, శ్రద్ధ నాకు బాగా తెలిశాయి.

నేనీయబోయే లక్ష్యార్థం మీద నీవు నిలబడగలవని తెలుసుకున్నాను. ఇక రారా! నాయనా! నీకు కావలసిన బోధను ప్రసాదిస్తాను. ఇంక ఆలస్యం చేయను. నీవు గట్టిగింజవని నాకు తెలిసింది. గట్టిగింజ పాదాన్ని విడువదు కనుక నాకున్నదంతా నీకు బోధిస్తాను. నిన్ను నా అంతటివాడను చేస్తాను. నిన్ను భవ బంధముల నుండి ఉద్ధరిస్తాను. నిన్ను తరింపజేస్తాను" అని ఎంతో కరుణతో ప్రేమతో ఆ గురుదేవుడు తన శిష్యుడికి ఉపదేశమిస్తాడు.

పూర్వపు రోజులలో 12సంవత్సరాలు శుశ్రూష చేస్తే, ఆశ్రమం గేటు లోపలికి రానిచ్చేవారు శిష్యులను. ఇంకొక పన్నెండేళ్ళు ఆశ్రమ సేవ చేసుకుంటే, యెాదో వొకనాడు ఆ గురువుగారికి ఆ శిష్యుడి యందు అనుగ్రహం కలిగి ఉపదేశమిచ్చేవారు. ఇది ఆనాటి సంగతి! మేమేగాని మిమ్మల్ని ఆ విధంగా చేసినట్లయితే .... ఆ! ఆ! ఇంకా యేమనన్నాడాయన శేషమ్మా?

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

"ఒక విద్యార్థి వుంటాడు. పరీక్షలకి చదవడు. సినిమాలకి అలవాటు పడి తిరుగుతాడు. భగవంతుడు లేడంటాడు. వాడికి తోడు మరి కొంతమంది బద్ధకస్థులు, సోమరిపోతులు పోగవుతారు. వీరంతా పరీక్షలలో తప్పుతారు. అటువంటి స్థితిలో కూడా భగవంతుడిని 'ప్రభూ! అజ్ఞానంలో తెలియక తప్పులు చేశాను. నువ్వు లేవని అనుకున్నాను' అని పశ్చాత్తాపముతో ప్రార్థిస్తే కరుణిస్తాడు. పరీక్ష ఫస్ట్ క్లాసులో ప్యాసు అవుతాడు. మరి భగవంతుడికి మరపు గాని ఏమరుపాటు గాని, పక్షపాతం గాని ఉన్నాయా? కృష్ణ పరమాత్ముడు అర్జునునికి విశ్వరూప దర్శనం ఇచ్చేముందు అర్జునుని నేత్రాలలో ఉండే అహంకార మమకారాలను జ్ఞాన ఖడ్గముతో ఆపరేషన్ చేశాడు. కాబట్టి అర్జునుడు కృష్ణ పరమాత్ముని నిజరూపాన్ని దర్శించగలిగాడు.



కాని మన డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటే పరికరాలు కావాలి. తీరా ఆపరేషన్ చేసిన తర్వాత చూపు వస్తుందో లేదో చెప్పలేము. అది వారి అదృష్టము. కాని బిల్లు మాత్రం పెద్దమొత్తంలో ఉంటుంది.

కృష్ణ పరమాత్ముని విశ్వరూప దర్శనంతో అర్జునునిలో ఉండే మోహము తొలగిపోయింది. విజయుడయ్యాడు. దేవతలు మనస్సును ఆయన దివ్య చరణారవిందములపై నిలిపారు కాబట్టి అమృతాన్ని సేవించగలిగారు. మీరు మోహానికి లొంగితే రాక్షసుల లాగా మాయలో పడతారు. ఆ మాయ సాలగ్రామంలో దివ్యత్వాన్ని గాని, వెంకట రమణుని శిలా ప్రతిమలో దైవత్వాన్ని గాని దర్శింపనీయదు.

చూడండి హెడ్‌మాష్టరుగారూ! ఈ పండితులంతా కలసి వుపన్యాసంలో బాబుగారు కూడా దశావతారాల లాగా ఒక అవతారం అని అన్నారు. మీది కూడా ఒక అవతారమే అది ముందు తెలుసుకోండి.

తులసీదాసు శ్రీరామచంద్రుని చరిత్ర వ్రాసినపుడు మనస్సు ఆయన దివ్యచరణార విందములయందు నిలిపి వ్రాశాడు. కలియుగంలో మానవులు తరించటానికి శ్రీకృష్ణపరమాత్ముడు అర్జునుడు అనే పాత్రలో జ్ఞానక్షీరాన్ని పితికి అందించాడు. అందుకున్నవాడిది భాగ్యం. త్రికరణ శుద్ధిగా తను మనోధనాల్ని అర్పించి గురులక్ష్యార్థముపై మనస్సు నిలిపిన వాడిలోని సమస్త గుణాల్ని బియ్యంలో రాళ్ళు ఏరినట్లు ఏరి పారేస్తాను అంటున్నాడు భగవంతుడు.

మానవజన్మ ఎత్తినందుకు సార్థకం చేసుకోండి, తమో గుణముతో గూడి నిదురపోవటానికి కాదు. ఏ పని చేస్తున్నా నాయందే మనస్సు నిలిపితే అది తపస్సు అవుతుంది' అని భగవానుడు హెచ్చరిస్తున్నాడు" అన్నారు శ్రీబాబు.



(గత సంచిక తరువాయి) # యోగవాశిష్ఠము - సుషుమ్నా ప్రసాద

"రాజుగారు వెంటనే యేమి వినపడనట్లు, ఆవృద్ధుని మాటలు లెక్కచేయకుండా, వడి వడిగా, రాజ భవనమునకు తిరిగి వెళ్లాడు, అంతఃపుర కాంతలు, సేవకులు రాజ భవనపు గవాక్షముల వద్ద నుండి ఆ వృద్ధుని మాట వినటం జరిగింది. వెంటనే వారు యీ రాజు ఛండాలుడుగ జన్మించాడా యని చాలా దుఃఖమునకు లోనైనారు. రాజు గారి ముఖము పాలిపోయింది. వెంటనే అంతఃపుర కాంతలు, భటులు, మంత్రి వర్గమును పిలిపించి, యీ విషయాన్ని తెలియజేసి, ప్రస్తుతం చేయవలసిన కర్తవ్యమేమిటని సంప్రదించారు.



వెంటనే మంత్రులు, రాణులు, భటులు రాజు గార్కి దూరంగా నిలబడ్డారు. వారందరూ రాజు అంటరాని జాతివాడని, ఆయన్ను స్పృశించటానికి కూడ నిరాకరించారు. ఒక ఛండాలునితో అనుబంధము పెట్టుకొన్నందుకు, ప్రాయశ్చిత్తంగా, వారంతా ప్రాయోపవేశం చేయాలని నిశ్చయించుకొన్నారు. వెంటనే రాజ్యంలోని పౌరులు, పసిపిల్లలతో సహా అగ్ని ప్రవేశంచేశారు, ఛండాల రాజు యీ విషాద సంఘటనను చూచి, అతని యెద చెదిరిపోయింది.

రాజు గారు తనలో తాను యిలా ఆలోచించటము ప్రారంభించాడు, 'నాతో అనుబంధము పెట్టుకొన్నందుకు అగ్ని ప్రవేశంచేసి, అంతరించారు, ఇక నా జీవితం వలన ప్రయోజనమేమి? నేను కూడ అగ్ని ప్రవేశంచేసి మరణిస్తాను' అలా నిశ్చయించుకొని, చితిపేర్చుకొని, అందులో దూకాడు, అలా ప్రాయోపవేశం చేయగానే, నది మధ్యలో నీటిలో మునిగి వున్న గాఢ భావోద్రేక పూరితమైన తన స్వప్నస్థితి (మాయామైకం) నుండి బాహ్య స్పృతికి వచ్చాడు అతని శరీరం వణుకుతూ అతని గుండె దుడుకుగా కొట్టుకొనటం ప్రారంభించింది. కొలది సమయము తర్వాత, అతని మనసులోని గజిబిజి అదృశ్యమైంది.

గాధి మాయా ప్రభావము నుండి బయటపడ్డాడు, అతని మనసిప్పుడు ప్రశాంతంగా వున్నది, మాయా ప్రభావము నుండి సంపూర్తిగా విముక్తుడైనాడు. అప్పుడు గాధి తటాక తీరమునకు వచ్చి, 'తానెవరు, తానేమి చూశాను, ఆ మైకం స్థితిలో తానేమి చేశాన'ని తీవ్రంగా ఆలోచించటము ప్రారంభించాడు.

గాధి అప్పడు తనలో తాను యిలా అనుకొన్నాడు "నేను గాధినే సందేహములేదు తటాకములో స్నానము చేస్తున్నాను, నేను చూసినదంతా, నన్ను సంభ్రమాశ్చర్యంలో ముంచి వేస్తున్నది. నాకసలు వివాహమే కాలేదు కదా భార్య యెలా వుంటుందో కూడ వూహించలేదు. దాంపత్య ప్రేమ యన్నదే, నాకనూహ్యము" ఇలా ఆలోచిస్తూ, కొన్ని రోజులు తన కుటీరంలో గడిపాడు.

- సశేషం

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2015

7 బుధ - శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

19 సోమ - మూలానక్షత్రం నుండి 22 గురువారం విజయదశమి వరకు ఉదయం 11గం. శ్రీకాళీమాత సహస్రనామార్చన, అనంతరం తీర్థ ప్రసాదములు. విజయదశమి రోజు భక్తసమారాధన.

24 శనివారం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

నవంబర్ 2015

6 శుక్ర : శ్రీగురుదశమి - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

11బుధ : దీపావళి - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

25 బుధ : గురుపూర్ణిమ - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

వివరములకు : శ్రీ నరసింహారావు సెల్ - 94912 22652,
శ్రీ ఎన్. సుబ్బరాజు సెల్ - 94403 77399

# సత్సంగ సౌరభం

- రమణ ప్రసాద్

విజయవాడలో దుర్గాపురంలో, ఘంటసాల వెంకటేశ్వరరావు మ్యూజిక్ కాలేజ్ ప్రాంగణంలో శ్రీబాబూ భక్త సమాజ్ , విజయవాడ వారి అధ్వర్యంలో సెప్టెంబర్ 18,19,20 తేదీలలో జరిగిన సత్సంగాలలో శ్రీ మాతాజీ వారు 18వ తేదీన చేసిన ప్రసంగం యొక్క సంక్షిప్త వివరణ ఇక్కడ ఇస్తున్నాము. -ఎడిటర్

శ్రీ మాతాజీ తమ అనుగ్రహభాషణం ఇలా మొదలుపెట్టారు - "ఒకసారి వినాయక చవితి పర్వదినం నాడు శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులతో, 'మీరు వినాయకుని ప్రణవ స్వరూపాన్ని గమనించారా?' అని అడిగారు. మేమంతా సందిగ్ధంలో ఉండగా, ' పిచ్చివాళ్ళలారా! శ్రీగణేశు ని తొండం ప్రణవాకారంలో ఉంటుంది' అన్నారు శ్రీబాబు.

అలాగే యీ పవిత్ర ప్రాంగణంలో శ్రీడూండి గణపతిని దర్శించటానికి వెళ్ళాను. 63 అడుగుల ఎత్తు ఉన్న శ్రీగణపతి విగ్రహాన్ని చూడాలంటే తల పైకిత్తి చూడాలి. అంటే ఊర్థ్వ దృష్టి కావాలి. కంటికి ఎదురుగా పాదాలే కనిపిస్తున్నాయి. ఆయన ముఖం చూడాలంటే ఊర్థ్వ దృష్టి కావాలి. మూలాధారం, స్వాధిష్టానం, మణి పురం, అనాహతం, విశుద్ధం, ఆజ్ఞ చక్రాలు దాటితే వచ్చేది సహస్రారం. అక్కడ పరమాత్మ ప్రకాశిస్తాడు.

గణపతి ఉపనిషత్తులో ఇలా ఉంది - ఓం లం నమస్తే గణపతయే । త్వమేవ ప్రత్యక్షం తత్త్వమసి । త్వమేవ కేవలం కర్తాఽసి । త్వమేవ కేవలం ధర్తాఽసి। త్వమేవ కేవలం హర్తాఽసి। త్వమేవ సర్వం ఖల్విదం బ్రహ్మాఽసి ।.... అని మొదలవుతుంది.

'ఓ గణపతి స్వామీ! నీవే తత్త్వమసివి. నీవే సృష్టి చేస్తున్నావు, పోషిస్తున్నావు, నీలోనే లయం చేసుకుంటున్నావు. నీవే పరబ్రహ్మావు...'

సృష్టి, స్థితి, లయాలు ఒక అవ్యక్తమైన అనంత శక్తి వల్ల జరుగుతున్నాయి. ఆ శక్తి మనలో ప్రకాశింపబట్టే మనం మనగలుగు తున్నాము. అదే గురు శక్తి. అది తప్పుకుంటే ఆ వ్యక్తి మరణించాడు అంటారు. మరణించాక వచ్చేవి ఎత్తిపోతలే. కాబట్టి మరణం సంభవించేలోగా మన పూర్వజన్మ పుణ్యం రాశీభూతం వల్ల వచ్చిన యీ

మానవ జన్మను సార్థకం చేసుకోవాలి. భగవంతుడు కంటికి కనిపించడు. మానవులను ఉద్ధరించటానికి భగవంతుడు మానవ రూపం ధరించి మహాత్ముల రూపంలో వస్తాడు. అట్టి సమర్థ సద్గురు మూర్తులే శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారు. అజ్ఞానం వల్ల మనం వారిని సామాన్య మానవుడిగా చూస్తాము. వారిని సాక్షాత్తు ఈశ్వరుడని నమ్మి వారి పాదాలను ఆశ్రయిస్తే వారు మనను గమ్య స్థానానికి చేరుస్తారు.

ఇక గణపతి విషయానికి వద్దాం. గణపతి ఉత్పత్తి గురించి మనందరికి తెలుసు. పార్వతీ దేవి అభ్యంగన స్నానం చేస్తూ, తను రాచుకున్న నలుగు పిండితో ఒక రూపాన్ని తయారు చేసి దానికి ప్రాణం పోసింది. ఆయనే ముద్దులు మూటకట్టే వినాయకుడు. అంటే ఆయన అమ్మ కొడుకు. ఆయనకు శక్తి అనే ఆయుధాన్ని ఇచ్చి ఎవ్వరూ రాకుండా చూడమని చెప్పి స్నానానికి వెళ్లింది. ఇంతలో గజాసురుడు అనే రాక్షసుడి పొట్ట చీల్చుకుని వచ్చిన శివుడు హుటాహుటిగా పార్వతి దగ్గరకు వస్తే ఈ బాలుడు అడ్డుకుంటాడు. అతని శిరస్సు ఖండించి లోపలికి వెళ్లి పార్వతీ దేవితో సంభాషిస్తూ ఉండగా ఈ బాలుని ప్రసక్తి వస్తుంది. శివుడు తాను ఈ బాలుని ఖండించి లోపలికి వచ్చానని చెబుతాడు. దుఃఖిస్తున్న పార్వతిని ఓదార్చి వినాయకుని బ్రతికించి,తాను సంహరించిన గజాసురుని శిరస్సు తెచ్చి పెట్టడంతో ఆయనకు గజాననుడు అని పేరు వచ్చింది.

దేవతలందరూ మాకు గణాలకు ఒక అధిపతిని ప్రసాదించమని ప్రార్థించగా, శివుడు అగ్రజుడైన వినాయకుని, అనుజుడైన కుమార స్వామిని పిలిచి,"మీలో ఎవ్వరైతే సకల తీర్థాలలో మునిగి తిరిగి ముందుగా వస్తారో వారికి గణాధిపత్యం లభిస్తుంది" అని చెప్పగా కుమార స్వామి తన వాహనమైన మయూరాన్ని ఎక్కి కార్యోన్ముఖుడై వెళ్తాడు. గణపతి తన అశక్తతకు చింతిస్తూ ఉంటే, పర్వతీ పరమేశ్వరులు ఓదార్చి, "కుమారా! మాతా, పితరులకు ముమ్మారు ప్రదక్షిణం చేస్తే సకల తీర్థాలు సేవించినట్లేనని ఎఱుగవా?" అని శివుడు వినాయకునికి నారాయణ మంత్రం ఉపదేశిస్తాడు.

(తరువాయి భాగం కోసం 18 వ పేజీ చూడండి)

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

అక్టోబర్ 2015

7 బుధ : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 శని : శనిత్రయోదశి

11 ఆది : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

12 సోమ : అమావాస్య

13 మంగ నుండి 24 శని వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు.

19 సోమ : మూలా నక్షత్రం - సరస్వతీ పూజ, శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

21 బుధః దుర్గాష్టమి; మహర్నవమి.

22 గురు : విజయదశమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు

23 శుక్ర నుండి 28 బుధవారం వరకు అఖండ సంకీర్తన.

24 శని : దీక్షావిరమణ, రాత్రి 7గం.లకు జగన్మాత నగరోత్సవం, 8గం. శ్రీసద్గురుపాదపూజ

25 ఆది మరియు 26 సోమ వారాలలో మృత్యుంజయ హోమం, సాధు మహాత్ముల సత్సంగములు. విచ్చేయుచున్న మహాత్ములు :

1. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, శ్రీశు కబ్రహ్మా శ్రమ పీఠాధిపతులు, శ్రీకాళహస్తి.

2. పరమపూజ్య శ్రీశ్రీశ్రీ దండి నిర్మాలానందగిరి స్వాములవారు, అష్టలక్ష్మి పీఠం, తెనాలి.

3. పరమపూజ్య శ్రీమాతా జ్యోతిర్మయానంద భారతివారు, శ్రీ పరబ్రహ్మ షణ్ముఖానంద ఆశ్రమాధిపతులు, పాలకొల్లు.

27 మంగళ : ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన (షష్ఠిపూర్తి) మహోత్సవం శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

నవంబర్ 2015

6 శుక్ర : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

9 సోమ : మాస శివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

10 మంగళ : నరకచతుర్దశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

11 బుధ : దీపావళి, అమావాస్య - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన,

రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట
15 ఆది : నాగుల చవితి.
22 ఆది : ఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, ఏకాహం సంకీర్తన.
23 సోమ : క్షీరాబ్ధి ద్వాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.
25 బుధ : గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, సాయంత్రం 6గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఊరేగింపు. చాతుర్మాస్య దీక్ష విరమణ.
28 శని నుండి 6-12-15 ఆదివారం వరకు శ్రీసద్గురు దేవుల పుణ్యారాధన మహోత్సవము.

● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ●

(సత్సంగ సౌరభం - 15వ పేజీ తరువాయి భాగం)

వినాయకుడు ఆ మంత్రాన్ని చేస్తూ, తల్లి తండ్రులకు ముమ్మారు ప్రదక్షిణం చేస్తాడు. కుమారస్వామి ఏ తీర్థానికి వెళ్ళినా ముందుగా స్నానం చేసి వెళ్తున్న వినాయకుడు కనిపించాడు. కుమార స్వామి తిరిగి వచ్చి, "ఈ స్థానానికి అగ్రజుడే అర్హుడు" అని చెప్పగా పరమేశ్వరుడు, వినాయకుని గణాధిపతిగా నిర్ణయించటంతో గణాధిపతి అని అయనకు పేరు వచ్చింది.

ఈ నాడు తల్లి తండ్రులను సరిగ్గా చూసుకునే వారు ఎందరు? వారికి వృద్ధాప్యం రాగానే ఎలా వదిలించుకోలా అని చూడటం శోచనీయం. తల్లి తండ్రులు ప్రత్యక్ష దైవాలు. కాబట్టి తల్లి తండ్రులను సేవించటం ప్రధమ కర్తవ్యం.

మనవజన్మ సార్థకం చేసుకోవాలంటే మూడు అవసరం అని శాస్త్రాలు చెబుతున్నాయి - అవి, మనుష్యత్వం, ముముక్షుత్వం, మహా పురుష సంశ్రయం. పూర్వజన్మ పుణ్యం చేత మనకి సమర్థులైన గురు దేవులు లభించారు. వారు చూపించిన మార్గ దర్శకత్వంలో నడిస్తే ముక్తి కరతలామలకం. అట్టి గురుదేవులు మనందరికీ శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని, ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించెదరు గాక! శుభీభవ!

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

గురువు అంటే ఎవరు?ఈ ప్రశ్న ప్రతి శిష్యుని హృదయాంతరాలలో జనించే ప్రశ్న. సద్గురుదేవులు ఆ విషయాన్ని తెలియజేస్తూ "గురువు అంటే జన్మ కర్మ బంధన నుండి విముక్తిని ప్రసాదించే సమర్థుడు. అంతేకాదు పుట్టుక, చావులేని స్థితిని సంపాదించుకొనే సాధనని తెలియజేసేవాడు. నీ నిజ స్వరూపాన్ని తెలియ జేస్తాడు. గణపతి ముని మహాపండితుడు. అన్ని శాస్త్రములు క్షుణ్ణంగా చదివినవాడు. శ్రీరమణ మహర్షి శిష్యుడు. అయితే శాస్త్రవాసన అప్పుడప్పుడు ఆయనని మాయలో పడవేసేది. తత్ఫలితంగా ఆయనకి సంశయాలు కలిగేవి. ఒకనాడు గణపతి ముని శ్రీరమణుని 'తపస్సు అంటే ఏమిటి స్వామీ? అని ప్రశ్నించారు.



శ్రీ రమణులు సమాధానం చెబుతూ 'అసలు నేనంటే యెవరు? అనే ప్రశ్న వేసుకో. ఆ ప్రశ్న ఎక్కడ జనించిందో అంతరాంతరాలలోకి వెళ్ళి వెదుకు. అప్పుడు దానికి సమాధానంగా అనుభూతిని పొందుతావు' అన్నారు.

మనమంతా చెప్పుకునే సంస్కారమనేది యెలా సంప్రాప్తించింది? అది కేవలం గురు బోధా శ్రవణం ద్వారా మాత్రమే కలుగుతుంది. నీ మనుస్సును సంస్కరించుకోవాలి. దాని ద్వారా సంస్కారము సంప్రాప్తింప జేసుకోవచ్చు. మనస్సు సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థ సాధన ద్వారానే సంస్కరింప బడుతుంది. బంగారాన్ని నిప్పులో వేస్తే అది శుద్ధి చెందుతుంది కదా! కాని బంగారం యథాతథంగానే వుంటుంది. అలాగే నీ సాధన ద్వారా నీ ప్రవృత్తిలో మార్పు వస్తుంది గాని, నీలో మార్పు వుండదు. దానిని గుర్తించాలి.

నీవు నీవుగానే వుంటావు సుమా! సద్గురుమూర్తిని జన్మ దుఃఖము జరాదుఃఖము రహితం చేసుకోవటానికి ఆశ్రయించాలి గాని,

తుచ్ఛమైన కోరికలకోసం కాదు. తననెత్తిమీద వున్న బరువు దించుకోకుండా మంత్రోపదేశంతో సంసారమనే బరువుని దించే గురువు కోసం అన్వేషణ సాగించే శిష్యుడెన్నడూ తరించడు.

శిష్యుడు సద్గురుమూర్తిని యెలా ఆశ్రయించాలంటే యినుప ముక్క అయస్కాంతాన్ని సమీపించగానే అతుక్కుంటుంది. తిథివార నక్షత్రాలు బాగున్నాయా లేదా అని చూస్తుందా! లేక ఒక టైమ్‌కు పరిమితం అవుతుందా! సద్గురుమూర్తిని ఆశ్రయించిన శిష్యుడు పూర్ణ కాముడు అవుతాడు. అంటే జీవించి వుండగానే కోర్కెలు లేని స్థితిని సాధించగలుగుతాడు.



# అభినవ చందన మందారమాల

- పెనుమాక నాగేశ్వరరావు

అభినవ చందన మందారమాల

సద్గురుమూర్తికి, శ్రీబాబూజీ మహరాజ్‌కు .... ఎందుకో తెలుసా .....

ఏరికోరి చేరదీసే మమ్మిలా

ప్రేమచూపి పెద్దచేసే అమ్మలా

వేలుచాపి నడక నేర్పే నాన్నలా

బోధచేసి బాగుచేసే గురువులా

నీడచూపి తోడు నిలిచే హితునిలా

మంచిచెడులు వేరుచేసి చూపే హంసలా, పరమహంసలా

తీర్చిదిద్దే నన్ను తామరాకుమీద నీటి బొట్టులా

మార్చివేసే నన్ను కోర్కెలేవీ లేని మనిషిలా

మౌనిలా, యోగిలా, జ్ఞానిలా నిలచే యెల్లవేళలా

కల్పతరువులా, కామధేనులా కాపాడుతుండే మమ్ము యిలా

ఆ మహనీయుని మరచుటెలా, మరచి మనుటెలా

బ్రతుకుటెలా, భవసాగరమీదుటెలా, అందుకే మళ్ళీ మళ్ళీ ....

అభివందన చందన మందారమాల .................



(గత సంచిక తరువాయి) # గీతాధ్యయనమ్ - రమణ ప్రసాద్

## రాజవిద్యా రాజగుహ్యాయోగము



విద్యలలోకెల్ల శ్రేష్ఠమైనది, రహస్యములలోకెల్ల రహస్యమైనది అయిన ఆధ్యాత్మికబోధ భగవానుడు చెప్పబోతున్నాడు. ఇందులో భగవత్స్వరూప వర్ణన, జగదుత్పత్తి, భగవానుని సర్వాత్మక స్వరూపము, నిష్కామ కర్మాచరణయొక్క ఫలము, దాని మహిమ వివరిస్తూ .....

మయా తతమిదం సర్వం। జగదవ్యక్తమూర్తినా।
మత్స్థాని సర్వభూతాని। న చాహం తేష్వవస్థితః॥ 4

ఇంద్రియాలకు కనిపించని నా రూపము విశ్వమంతా వ్యాపించి వున్నది. సర్వజీవులూ నాలో వున్నాయి. నేను వాటిలో లేను. ఎలా అయితే వాయువు ఆకాశంలో నిలిచి వున్నదో, అలాగే సర్వ భూతాలూ నాలో వున్నాయి. ప్రళయ కాలంలో యీ ప్రాణికోటులు నాలో ప్రవేశించి, సృష్టికాలంలో నాచే సృజింప బడుతున్నాయి. సమస్త ప్రాణికోటికి ప్రభువైన నా పరమాత్మ తత్త్వం తెలియని మూఢులు నన్ను సామాన్య మానవునిగా భావిస్తున్నారు.

మోఘాశా మోఘకర్మాణః। మోఘజ్ఞానా విచేతసః।
రాక్షసీమాసురీం చైవ। ప్రకృతిం మోహినీం శ్రితాః॥ 12

ఈ మూఢులు వ్యర్థమైన ఆశలతో, వ్యర్థమైన కర్మకలవారును, వ్యర్థ జ్ఞానము కలవారును, బుద్ధిహీనులై అసురస్వభావమును ఆశ్రయిస్తారు.

ఈ జగత్తుకు తల్లీదండ్రి, కర్మఫలదాతా, తెలిసికొనగల వస్తువు నేనే. ఓంకారం నేనే. వేదములు నేనే. ఈ జగత్తుకు గతి, పతి, ప్రభువు, సాక్షి, నివాసము, సుస్థిరత, సంహారకుడు, ప్రళయం, శాశ్వతబీజం నేనే. నేనే వేడిని కలుగుజేస్తున్నాను. వర్షాన్ని కురిపిస్తున్నాను. అమృతమూ, మృత్యువూ నేనే. సత్తు అసత్తు నేనే.

ఏకాగ్ర చిత్తంతో నిరంతరం నన్నే స్మరిస్తూ, నన్ను సేవించేవారి యోగక్షేమాలు నేనే చూస్తాను.

పత్రం పుష్పం ఫలం తోయం। యో మే భక్త్యా ప్రయచ్ఛతి।
తదహం భక్త్యుపహృతం। అశ్నామి ప్రయతాత్మనః॥ 26

ఎవడు నాకు భక్తితో ఆకుగాని, పుష్పంగాని, పండుగాని, జలముగాని సమర్పిస్తున్నారో ఆ పత్రపుష్పాలను నేను ప్రీతితో స్వీకరిస్తున్నాను. పత్రమును విదురుడు, ద్రౌపది అర్పించారు. పుష్పాన్ని గజేంద్రుడు అర్పించాడు. ఫలమును శబరి అర్పించింది. నీటిని రంతిదేవుడు అర్పించాడు. వారు నాకు పత్రపుష్పాలను భక్తితో అర్పించి కృతార్థులయ్యారు.

యత్కరోషి యదశ్నాసి। యజ్జుహోషి దదాసి యత్।
యత్తపస్యసి కౌంతేయ! తత్కురుష్వ మదర్పణమ్॥ 27

అర్జునా! నీవేది చేసినా, తినినా, హోమం చేసినా, దానం చేసినా దానిని నాకర్పించు. యద్యత్కర్మ కరోమి తద్దఖిలమ్ శంభో తవారాధనమ్ - ఓ పరమశివా! నేను నడిచినా, కూర్చున్నా, భుజించినా, అది నీ ఆరాధనమే. కర్మఫలసమర్పణ యోగంతో నువ్వు కర్మబంధాల నుండి విముక్తుడవై నన్ను చేరతావు.

అపి చేత్సుదురాచారః। భజతే మామనన్యభాక్।
సాధురేవ స మంతవ్యః। సమ్యగ్వ్యవసితో హి సః॥ 30

ఎంతటి పాపియైనా యేకాగ్రచిత్తంతో నన్ను సేవించేవాడు సత్పురుషుడే అవుతున్నాడు. అర్జునా! నన్ను ఆశ్రయించిన పాపాత్ముడు అచిరకాలంలోనే ధర్మాత్ముడై శాశ్వతమైన శాంతిని పొందుతాడు. 'నా భక్తుడెన్నడూ చెడిపోడు' అని ఘంటాపదంగా చెబుతున్నాను.

మన్మనా భవ మద్భక్తః। మద్యాజీ మాం నమస్కురు।
మామేవైష్యసి యుక్త్వైవం। ఆత్మానం మత్పరాయణః॥ 34

నా మీదే భక్తిగలిగి నన్నే పూజించు, నాకే నమస్కరించు, యిలా నన్ను ఆశ్రయించి, నా మీద మనస్సు నిలిపితే నన్నే పొందుతావు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

ఆభ్యాం విలోచనాభ్యాం అంబుజ దళ లలిత విలోచనం బాలమ్ ।
ద్వాభ్యామపి పరిలబ్ధుం దూరే మమహంత! దైవసామాగ్రీ ॥

తాత్పర్యము - ఈ నేత్రముల రెంటి చేతను గూడ తామరరేకుల వలె సుందరములైన కన్నులు గలవాడగు బాలుడగు శ్రీకృష్ణుని కౌగలించుటకు నా యొక్క అదృష్టము దూరంగా వున్నది అయ్యో!



'శ్యామసుందరా! ఎవరు నువ్వు? యింత రాత్రి వేళలో, యింత చీకటిలో ఎందుకు వచ్చావు?' అని నన్ను అడిగిన నీ ప్రశ్నలకు సమాధానం చెబుతున్నా.

"నేను యీ గోకులంలో పుట్టి పెరిగిన దాన్ని. మట్టి తట్టలు మోసి బ్రతికే మాణిక్యాన్ని. అమ్మా నాన్నలు యిల్లు కట్టే పనిలో కుదిరితే నేనూ వారికి సహాయంగా పనిచేసి నాలుగు డబ్బులు సంపాదిస్తున్నాను.

ఒకరోజు పనిచేసే చెట్టుకి ఊయలకట్టి నా బిడ్డను ఊపుతుంటే ఒకటే పోరుపెట్టి యేడుస్తున్నాడు, ఆకలేమో అని పాలివ్వబోతే తాగలేదు. ఇంతలో గాలిలో ఎక్కడో సన్నని యీల పాటలాగ వినబడింది, అది విని నిద్రలోకి జారుకున్నాడు. బిడ్డ ఏడ్చినప్పుడల్లా వినిపించటానికి ఆ పాటను నా గొంతులో నింపుకోవటానికి ప్రయత్నిస్తే విఫలమైంది. ఆ పాట పాడినది ఎవరమ్మా? అని మా అమ్మనడిగితే తనకు తెలియదన్నది. ఎవరో చెప్పారు మా పల్లెకి రాజైన నందయ్యగారబ్బాయి. గోవులను మేపుకుంటూ పిల్లన గ్రోలి వాయిస్తాడు. వాడిపేర్లు కన్నయ్య, శ్యామసుందరుడు, నల్లనయ్య, కృష్ణయ్య అని చెప్పగా విని, నిన్ను శ్యామసుందరా! అని పిలిచానయ్యా!

నీ పాట విన్నప్పుడల్లా నా మనస్సు ఆనందంతో నిండిపోతుంది. ఆ పిల్లన గ్రోవిని మరోసారి వాయించమని అడగాలనే కోర్కె మనస్సు నిండా నిండిపోయింది. నాకు ఒక బిడ్డ కలిగాక భర్త గతించి పోయాడు. నాకు చూపు లేదు. ఒకనాడు మట్టితట్ట తలపైకెత్తటానికి అమ్మరావటానికి క్షణం ఆలస్యం అయినప్పుడు ఒక మెత్తటి చెయ్యి నా తలమీదకి ఆ తట్టని

ఎత్తి పెట్టింది. ఆ స్పర్శ ఎంత హాయిగా ఉన్నదంటే మండుటెండలో మాడిపోతుంటే చల్లని వానచినుకు పడగానే ఎంతహాయిగా వుంటుందో అలా వుంది! వేయి మెరుపులు మెరిశాయి నా తలలో. ఆ ఆనందాన్ని వర్ణించలేను. ఇంతకు ముందు నా బిడ్డను ఆరుబయట పడుకోబెట్టుకుని పడుకున్నాను. నీ పిల్లన గ్రోవి మధురాతిమధురంగా వినిపించేసరికి యిక ఆగలేకపోయాను. అప్పుడు లేచి నెమ్మదిగా తడుముకుంటు వస్తుంటే ఆదే మెత్తటి చేయి నా చేతిని పట్టుకుని యిక్కడకి నడిపిస్తూ వచ్చింది. నీ పాట మళ్ళీ మళ్ళీ వినాలని వచ్చాను. నా చుట్టూ వుండే చీకటి ఎలా వుంటుందో నాకు తెలియదు. ఎందుకంటే నాకు చూపు లేదు కనుక.

నిన్ను చూడాలనే ఆశతో నీ దగ్గరకు తీసుకువెళ్ళమని అడిగితే చుట్టూ వున్నవాళ్ళు నవ్వారు! నువ్వు చూడగలవా? అని అడిగారు. కాని నాకు మనోబలం చాలా ఉంది. ఎలాగంటే నువ్వు ఎన్నో గొప్పగొప్ప పనులు చేశావని విన్నాను. ఎందరినో కష్టాలలో ఆదుకున్నావట! అందరూ చెప్పుకుంటుటే విని నా మనస్సులో ఆశ పెరిగిపోయి, నా కోరిక తీరుస్తావనే నమ్మకంతో వచ్చాను కన్నయ్యా!"

మాణిక్యం చెప్పినదంతా విన్నాక నల్లనయ్య "నీకు యిప్పుడు చూపునిస్తే ఎవరిని చూడాలని వుంది? కన్నతల్లిదండ్రులనా? కట్టుకున్న వాడినా? కన్నబిడ్డనా?" అని ప్రశ్నించాడు ఆమెను పరీక్షించాటనికి. "ఇన్నాళ్ళనుండీ ఎందుకు బ్రతికి ఉన్నానో! పొందవలసిన మహదానందాన్ని నీ పిల్లనగ్రోవి పాటలో నాలో నింపిన నీ దివ్యరూపాన్నే నాకు చూడాలని ఉంది" అన్నది.

"అయితే చూడు!" అన్నాడు నల్లనయ్య. అప్పుడొక గొప్ప మెరుపు మెరిసింది. ఆమె కళ్ళ ముందు గొప్ప వెలుగు నిండింది. ఆ వెలుగులో స్వామి చల్లని చూపులుగల విశాలనేత్రాలను, అతి సుందర విగ్రహాన్ని దర్శించిన మాణిక్యం 'ఇంక చాలు కన్నయ్యా! నా కోరిక తీరింది. నిన్ను చూసిన కళ్ళతో మరొకదానిని నేను చూడలేను' అని ఆ రూపాన్ని కళ్ళలో బంధించి కనులు మూసేసుకుంది మాణిక్యం. కనులతో ఆయన్ను కౌగలించాలనుకున్న ఆమె కోరికను తీర్చాడు నల్లనయ్య!

# కర్మయోగము

- పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ

ప్రపంచంలో ఒకవైపు ఆలయాలూ, ఆధ్యాత్మికతా పెరుగుతూ వుంటే, మరొకవైపు అంతకంటె ఎక్కువగా హత్యాకాండలు, దోపిడీలు, మానభంగాలు, అరాచకం, మతవిద్వేషాలు కూడ పెరిగిపోవటం మనం చూస్తున్నాము. ఈ అమానుష కృత్యాలకు కారణం అజ్ఞానం. మనం కూడా జంతువుల లాగా జీవిస్తే చాలు అనుకుంటే మనకు జంతుజన్మలలో కెల్ల ఉత్తమమైన యీ నర జన్మ వచ్చినందుకు ప్రయోజనం యేమున్నది? ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతమైతే వచ్చిన దుర్లభమైన నరజన్మను వృథా చేసుకోకూడదు.

ఈ శరీరంలో ప్రాణం వుండగానే మనం యీ దేహానికి పరిమితి కాదని, యేది దీనిలో వున్నందున యీ దేహం చైతన్యవంతమై కర్మలను ఆచరిస్తున్నదో, ఆ చైతన్య స్వరూపులమే మనము అన్న సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలిసికొని, కర్మఫలంగా వచ్చే యీ జన్మ పరంపర నుండి బయటపడి, అమృతస్వరూపులం కావాలి. అది ఒక్క యీ నరజన్మలోనే సాధ్యం. దీనిని చేజార్చుకుంటే మళ్ళీ నరజన్మే వస్తుందన్న గ్యారెంటీ లేదు.

అజ్ఞానం జ్ఞానం వలనగాని నివృత్తి కాదు. ఎవరుపడితే వారు యే సాధనా చేయకుండా జ్ఞానాన్ని పొందలేరు. జ్ఞానం విచారణ ద్వారానే సాధ్యం. అయితే ఆ విచారణ చేయటానికి నైష్కర్మ్య సిద్ధి (అంటే కర్మలో అకర్మను చూడటం) పొందితేకానీ అర్హత రాదు.

నైష్కర్మ్యసిద్ధీ, జ్ఞానమూ, విషయాదులను పట్టుకుని వ్రేలాడుతున్న వరకు కలుగవు. ఇవి కలగాలంటే మొగ్గ పువ్వుగా వికసించినట్లు, సాధకుడు కూడా ఆధ్యాత్మికంగా వికసించాలి. మొగ్గ పువ్వుగా వికసించటం యెలా అనివార్యమో, అలాగే సాధకుడు కూడా సాధన ద్వారా ఆధ్యాత్మికంగా వికసించటం కూడా అనివార్యం. అలా వికసించే అవకాశం అందరికీ వున్నది.

సాంఖ్యులు యిరువది నాలుగు తత్త్వాలను విచారణచేసి, జడములు, అనాత్మ వస్తువులు అయిన యివేవీ తాము కాము అని

శేషించిన 'ఆత్మ'తో తాదత్మ్యం చెంది, 'నేను, నాది' అనే భావాలను వదిలి పెడతారు. వారికి దేహాభిమానం లేదు కనుక కర్మఫలాలు వారిని బంధించలేవు. కాని దేహాభిమానం యింకా పూర్తిగా వదలని కర్మయోగులు, భగవంతుని యందు దృఢమైన విశ్వాసంతో బంధ హేతువులైన కర్మఫలాలను త్యజించి, కర్మలను పరమేశ్వరార్పణంగా ఆచరిస్తూ పోతే, క్రమంగా దేహాభిమానం నశించి, కర్మబంధాల నుండి విముక్తులౌతారు. బుద్ధిని భగంతునివైపు నిలిపి, బుద్ధియోగంతో కర్మలను ఆచరిస్తూ క్రమంగా నైష్కర్మ్య సిద్ధిని పొంది, జ్ఞాన నిష్ఠ యోగ్యత, జ్ఞాన నిష్ఠ జ్ఞానమును పొందుతారు.

ఆ విధంగా నైష్కర్మ్య సిద్ధి, ఆధ్యాత్మిక వికాసం కర్మలను ఫలాభి సంధి లేకుండా, బుద్ధియోగంతో ఆచరించి, ఆ కర్మలకు అతీతులుగా కావటం ద్వారా మాత్రమే సాధ్యమౌతాయి. అంతేకాని, 'నాకు కర్మలతో పనిలేదు కనుక, పైగా కర్మాచరణలో అనేక కష్టాలుంటాయి కనుక, నేను కర్మలను ఆచరించకుండా పూరకనే కూర్చుంటాను' అని మనం కర్మలను యెగవేసి పూరికే కూర్చున్నందు వలన కలుగదు. కర్మమయమైన యీ ప్రపంచంలో అది సాధ్యమయ్యేదీ కాదు. ఒకవేళ ఎవరైనా బలవంతంగా కర్మేంద్రియాలను వాటి వ్యాపారాల నుండి మరల్చితే, వారు పనిదొంగలు, సోమరిపోతులు అవుతారు. వారికి తమోరూపమైన జడ సమాధి కలుగుతుంది గాని, నిర్వికల్ప సమాధి మాత్రం కలుగదు.

ఎగురుతున్న విమానంలో కూర్చున్నవాడు 'నేను కదలకుండా కూర్చున్నాను' అన్నా, విమానం కదులుతున్నది కనుక, వాడూ కదులుతున్న వాడే అవుతాడు. మనము మాయ అనే రథంలో కూర్చుని వున్నాము. 'నేను కదలటం లేదు, యేమీ చేయటం లేదు' అని మనం అన్నా, మన ఉచ్ఛ్వాసనిశ్వాసలు జరిగిపోతూనే వున్నాయి. మన గుండె కొట్టుకుంటూనే వున్నది. అవన్నీ అలా వుంచితే మన మనస్సు పనిచేయకుండా వున్నదా? ప్రకృతిలోని త్రిగుణముల స్వభావం వలన మనకు కర్మలు చేయటం తప్పనిసరి అవుతున్నది. అలా బలవంతంగా కర్మలు ఆచరించవలసినంత పర్యంతము మనకు నైష్కర్మ్య సిద్ధి కలుగదు.

- సశేషం

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

'అహం బ్రహ్మాస్మి' - 'నేను బ్రహ్మను' అని చెప్పుకోవటం వలన జ్ఞాని కాలేడు. బ్రహ్మను నేను అని అనుభూతిని పొందినవాడు జ్ఞాని. జ్ఞానము తెలుసుకునేది, పొందేది కాదు. జ్ఞానము, జ్ఞాత్వా, బ్రహ్మము దేశకాల వస్తువులకు ఆధారమైనది. పరిచ్ఛేదము లేనిది. సర్వవ్యాపక మైనది. అది ప్రమాణాలకు, దృష్టాంతాలకు అందేది కాదు. అతి వ్యాప్త మైనది. ఆది అంతములేనిది. చావు పుట్టుకలు లేనిది. అది అజః అంటే అనాది. ఏది పొందితే యింక దుఃఖము అనేది లేకుండా కాపాడుతుందో అదే ముక్తస్థితి. ముక్తస్థితిని పొందినవారికి యింక పొందవలసినది వుండదు. సంకల్పాలు వుండవు.

ముక్తస్థితిని పొందనివారి మనస్సులో సంకల్పాలు బీజ స్థితిలో నిక్షిప్తమై వుంటాయి. అవి సమయం వచ్చినప్పుడు బయల్పడతాయి. భూమిని దున్ని చదువుచేసి, కలుపు మొక్కలన్నింటిని నిర్మూలించి, పైరు వేస్తాము. వర్షం పడగానే భూమిలో నిక్షిప్తమై వున్న బీజాలు అంకురించి, కలుపు మొక్కలు వస్తాయి. అలాగే మనస్సు వృత్తి రాహిత్యమవనంతవరకు ముక్తిలేదు.

జ్ఞాని సంఘంలో వున్నా నిస్సంగుడు. జైలులో ఖైదీ వుంటాడు. జైలు అధికారి సూపరింటెండెంట్ వుంటాడు. ఇద్దరికీ తేడా వుంటుంది కదా! ఆత్మవస్తువు అనాది యెలా అయింది? కన్ను చూడటానికి, శ్రోత్రేంద్రియం వినటానికి, స్పర్శేంద్రియం తాకటానికి, మనస్సు సంకల్పించ డానికి ప్రవృత్తి వుంది అంటే ఆది వుంది. కాని ఆత్మకు ఆది లేదు, ప్రవృత్తి లేదు. అందువలననే దానిని అనాది అన్నారు.

- సశేషం

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

## సుందోపసుందులు

- శ్రీ రామానుజ దాసు

లోకంలో యెక్కడైనా మొదట అన్నదమ్ములు సఖ్యతగా వుండి, తరువాత యేదో కారణం వల్ల పోట్లాట వస్తే, వారినిచూసి సుందోప సుందుల్లాగా పోట్లాడుకుంటున్నారే! కారణమేమైవుంటుంది? అనుకుంటారు. ఇంద్రప్రస్థ పురంలో ధర్మరాజు తన సోదరసమేతుడై రాజ్యపాలన చేస్తున్న సమయంలో అక్కడకి నారదమహర్షి విచ్చేశాడు.

నారదమహర్షికి యథావిధిగా పూజచేసి, 'మా పుణ్యఫలం వల్ల మీ దర్శనభాగ్యం కలిగింది' అన్నాడు ధర్మరాజు. ద్రౌపదిని పిలిపించి, నారద మహర్షికి నమస్కారం చేయించిన పిమ్మట, నారదుడు ఆమెను ఆశీర్వదించాడు. ద్రౌపదిని వెళ్ళిపొమ్మని సోదరులైదుగురితో నారుదుడు "ధర్మరాజా! మీకు సకల ధర్మాలూ తెలుసు. లెక్కలేనన్ని మంచి గుణాలు కలిగినవాళ్ళు. పేరుకెక్కిన ద్రౌపది మీకందరికి అర్ధాంగి. మీలో మీకు పోట్లాటలు రాకూడదంటే యేదో నియమం పెట్టుకోవాలి. పూర్వం సుందోప సుందులు అనే పేరుగల అన్నదమ్ములు ఒక స్త్రీ కోసం కలహించి ఒకరినొకరు కొట్టుకుని మరణించారు" అని చెప్పగానే, ఆ కథను చెప్పమని ధర్మరాజు కోరాడు.

హిరణ్యకశిపుని వంశంలో నికుంభుడు అనే వానికి సుందుడు, ఉపసుందుడు అని యిద్దరు కుమారులున్నారు. వారిద్దరూ పరమ క్రూరులు. వారి భావాలు, పనులు, సుఖాలు, దుఃఖాలు ఒకే రకంగా వుండేవి. ముల్లోకాలు జయించాలనే కోరికతో వింధ్యపర్వతం మీద తపస్సు చేయటానికి పూనుకున్నారు. ఆకలిదప్పులు సహిస్తూ, యింద్రియాలను అదుపులో వుంచుకుని, జటావల్కాలు ధరించి, గాలి మాత్రమే పీలుస్తూ, ఒంటికాలిపై నిలబడి ఘోరమైన తపస్సు చేశారు. ఆ తపస్సు ఫలితంగా బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమన్నాడు.

"బ్రహ్మదేవా! మా కోర్కె తీర్చటానికి మీకు యిష్టం వున్నట్లయితే, కోరిన రూపంకలిగి వుండేట్లు, కోరిన విధంగా వెళ్ళేట్లు, అన్ని మాయలు కలిగేట్లు, చావులేకుండా వుండేలాగ వరమివ్వండి" అని కోరుకున్నారు. 'అమరత్వం తప్ప మరేదైనా కోరుకోండి' అన్నాడు బ్రహ్మ. అప్పుడు వారిద్దరూ "స్వామీ! అలా అయితే మేమిద్దరం యే ప్రాణిచేతగాని, యే పదార్థం

చేతగాని మరణించకూడదు. మరణం అంటూ సంభవిస్తే ఒకరి చేతిలో మరొకరు మరణించటం మాత్రమే జరగాలి" అని కోరుకున్నారు. బ్రహ్మదేవుడు 'అలాగే' అని వరం యిచ్చి సత్య లోకానికి వెళ్ళాడు.

సుందోప సుందులు వరాలను పొంది నగరానికి తిరిగి వచ్చారు. వారి బంధువులతో కూడి మహోత్సవాలు జరుపుకున్నారు. వారి నగరం అంతా 'తిను, త్రాగు, అనుభవించు' అనే నినాదాలే వినిపించాయి. వర గర్వంతో యిష్టం వచ్చిన రూపాలు ధరిస్తూ మునులకు, ప్రాణ భయం కలిగించారు. వారి ఆగడాలకు అంతమే లేకుండా పోయింది. దేవతలు, మునులు, మహర్షులు, సత్యలోకంలో బ్రహ్మదేవుడికి మొరవినిపించారు.

బ్రహ్మ ఒక్క క్షణం ఆలోచించి, విశ్వకర్మను పిలిచి అందం, కాంతి కలిగిన ఒక స్త్రీని సృష్టించమని చెప్పాడు. విశ్వకర్మ లోకంలోని శ్రేష్ఠమైన వస్తువులలో తిల ప్రమాణం (నువ్వు గింజంత) గల అంశలను తీసుకుని ఒక్కొక్క అంగాన్ని నిర్మిస్తూ ఒక స్త్రీని సృష్టించాడు. ఆమెకు తిలోత్తమ అని పేరుపెట్టాడు. "తిలోత్తమా! నువ్వు సుందోపసుందుల దగ్గరకెళ్ళి. నీ అందంతో వారిని మైమరపించు. వాళ్ళిద్దరూ నీ కారణంగా తమలోతాము పోట్లాడుకుని మరణించేలాగ చేయి" అన్నాడు.

వింధ్యపర్వత గుహలో వున్న సుందోపసుందులను సమీపించింది తిలోత్తమ. ఆమెను చూడగానే అన్నదమ్ములిద్దరూ మన్మథపీడితులు అయ్యారు. ఇది నా భార్య అంటే, ఇది నా భార్య అంటూ యిద్దరూ ఆమె చేతులు పట్టుకున్నారు. సుందుడు 'ఇది నా భార్య. నీకు వదినగారు అవుతుంది నువ్వు తప్పుకో' అన్నాడు. వెంటనే ఉపసుందుడు 'ఇది నా భార్య. నీకు మరదలు అవుతుంది నీవే తప్పుకో' అన్నాడు. అలా వాదన పెరిగి పెరిగి యిద్దరూ ఒకరినొకరు కొట్టుకుని చివరకు మరణించారు.

'ధైర్యవంతులు కూడా స్త్రీల కారణంగా విరోధం పొందుతారు. కావున యేదో ఒక నియమం యేర్పాటు చేసుకుంటే మంచిది' అని నారదుడు ధర్మరాజుతో అన్నాడు.

ఆ నియమం ప్రకారమే ద్రౌపది ఒకరితో ఏకాంతంలో వుండగా రెండోవారు అటు రాకూడదని, ఎవరైనా అలా వచ్చినట్లయితే వారు 12సంవత్సరాలు బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ అడవులలో వుండాలని నారదుని ఎదుటనే ప్రతిజ్ఞ చేశారు పాండవులు.

# అమెరికా పర్యటనలో శ్రీ మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

భగవద్లీల, భగవతత్త్వం, భగవద్వైభవం ఎలా ఉంటుందో బావాజీ చరిత్ర ద్వారా తెలుసుకున్నాము కదా! భక్తుల చరిత్రలు చూస్తే వారు పడిన కష్టాలు ఎవరూ పడలేదేమో అనిపిస్తుంది. ఆ కష్టాలను వారు ఇష్టంగా అనుభవించారు. స్లాబ్ వేసినప్పుడు వైబ్రేటరుతో మూలమూలలా కుదుపుతారు. గునపాలతో సద్దుతారు. భగవంతుడు కూడా అలాగే భక్తులకు పరీక్షలు పెట్టి, వాటిలో వారు నెగ్గేటట్టుగా తానే చూస్తాడు. మీరా తల్లిని దామాదులు ఎన్నో బాధలు పెట్టారు. పాములతో కరిపించారు. విషమిచ్చారు. సర్వం కృష్ణార్పణం! అని భరించింది. అలాగే బావాజీ "ప్రభూ! దుఃఖమూ నీ లీల. ఆనందమూ నీ లీల" అని భగవంతుని కొనియాడాడు.

మనం కూడా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాము. 'ప్రభూ! ఇది నీ దయ!' అని సమత్వభావం కలిగి ఉండాలి. ఆ ధైర్యం రావాలి. అప్పుడు శాపంకూడా వరంగా మారుతుంది.

దశరథ మహారాజుకి సంతానం లేదు. ఆయన వేటకు వెళ్ళాడు. ఆయనకు శబ్దభేది విద్య తెలుసు. తన తల్లి తండ్రుల దాహం తీర్చటానికి శ్రవణ కుమారుడు నదిలో బిందె ముంచుతాడు. అది మృగం చేస్తున్న శబ్దమని భావించి దశరథుడు బాణం వెయ్యటం, ఆ బాణం తగిలి శ్రవణ కుమారుడు మరణించటం జరుగుతుంది. దశరథుడు దుఃఖిస్తుంటే, 'రాజా! ఈ జీవితం అశాశ్వతం. ఏ నాటికైనా మరణం అనివార్యం. మీరు చింతించకండి. ఈ నీటితో మా తల్లిదండ్రుల దాహం తీర్చండి' అని చెప్పి కన్ను మూస్తాడు.

దశరథుడు వారి దగ్గరకు వెళ్ళాడు. మాట్లాడితే గుర్తుపడతారు అని చేతితో నీరు అందించాడు. అతని చేతి ఆభరణం తగిలి 'ఎవరు నువ్వు?' అని అడిగాడు. దశరథుడు జరిగినది చెప్పగా, 'నా కొడుకును అన్యాయంగా చంపావు. మేము పుత్రశోకంతో ఎలా మరణిస్తున్నామో, అలాగ నువ్వు కూడా పుత్రశోకంతో మరణిస్తావు' అని శాపం ఇచ్చాడు. ఆ శాపం వరంగా మారి దశరథుడికి రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు

జన్మించారు.

సుఖమూ నీ దయ, దుఃఖము నీ దయ

నీ దయ లేనిదే ఏదియు లేదయా - అని నమ్మి భగవంతుడే నడిపిస్తున్నాడనే విశ్వాసంతో లక్ష్యార్థ సాధన చేస్తూ ఉండాలి. మనకి వుపాధిని ఇచ్చి, మనలో ఉన్న సత్యత్వాన్ని గుర్తించమని హెచ్చరిక చేస్తున్నారు శ్రీ గురుదేవులు. అట్టి భక్తిని, శక్తిని, అఖండ సాధనా సంపత్తిని శ్రీ గురుదేవులు ప్రసాదించు గాక! సుఖీభవ!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2015

7-10-15 బుధవారం శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

13-10-15 నుండి 22-10-15వరకు శరన్నవరాత్రి పూజలు.

22-10-15 గురువారం విజయదశమి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

27-10-15 పూర్ణిమ -

సాయంత్రం 5-30ని॥లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

నవంబర్ 2015

6 శుక్ర - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

11 బుధ దీపావళి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

25 బుధ శ్రీగురుపూర్ణిమ - సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# సత్సంగామృతం

- మురళి

ఏ జీవుడైతే మనస్సును జయించగలుగుతున్నాడో, వాడు శివ స్వరూపాన్ని పొందగలుగుతున్నాడు. శివః అంటే మంగళస్వరూపము. అక్కడ జీవుడు వేరుగా వుండడు. మానవులు ప్రపంచ విషయాలలో పడి దిగజారిపోతున్నారు. దానితోపాటు నీ జీవితం కూడా పతనమై పోతుంది. అందుకని మనం యెవరికి మ్రొక్కాలి? నీ గురుదేవునికి. నీ గురుదేవుడు ఎవరైతే వున్నారో, ఆ గురుదేవుడి ముందు శిరస్సు వంచి సర్వకాల సర్వావస్థల యందు సమర్పణ భావన కలిగి వుండాలి. సద్గురుపాదాన్ని ఆశ్రయించిన వారు స్వామివారి బోధామృతం వింటూ, ప్రతి వస్తువులో వాస్తవికతను మనం గుర్తించాలి.



మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారాలు సరియైన స్థితికి యెలా వస్తాయి? మనస్సు సత్య స్వరూపాన్ని యెప్పుడు పొందుతుంది? అసలు సింహద్వారం మనస్సే. మనస్సులోని సంకల్పాలు సుసంకల్పాలుగా మారాలి. ఆసన శుద్ధి కలిగి, మనస్సు యేకాగ్రతతో మహాత్ముల ముఖస్తుగా వెలువడుతున్న తత్వాన్ని జుర్రుకో. లేకపోతే స్వామి ముందు యేకాగ్రతగా కూర్చుని హాయిగా స్మరణ చేసుకో. మీ సాధన విషయం యింకొకరికి తెలియనక్కర్లేదు.సమయం సద్వినియోగం అవుతుంది. ఎవరైతే యీ విధంగా సమయాన్ని సద్వినియోగ పరచుకుంటారో, అటువంటి వారికి యీ కాలం నిత్యకాలంలో జమ అవుతుంది.

తీసుకునే ప్రసాదం కూడ పెట్టేటటువంటి వారి మనస్సును బట్టి

వుంటుంది. భగవంతుని ఆలోచన, నామ సంకీర్తన వున్నవారి దగ్గర పది అడుగులు ముందుకెళ్లైనా సరే ప్రసాదం తీసుకోవాలి. దురాలోచనా పరులైనవారు, త్రిగుణభూయిష్ఠులైనవారు నీకు అమృతం యిస్తానన్నా avoid చెయ్యటం వుత్తమం. అటువంటిది జీర్ణం కూడా అవదు. వారు అమృతం పెట్టవచ్చు, యెక్కడెక్కడ దొరకని స్వీట్లు తెచ్చిపెట్టవచ్చు, మనకది మంచి చేయనప్పుడు యేం లాభం? 'గంగిగోవుపాలు గరిటైడన చాలు। కడివెడైననేమి ఖరముపాలు । భక్తికలుగు కూడు పట్టెడైనను చాలు । విశ్వదాభిరామ వినురవేమ॥' అన్నాడు వేమన. మన స్వామివారు కూడా యీ పద్యాన్ని తమ బోధలో ఎన్నో సార్లు చెప్పేవారు. సద్గురువులకు మనము పంచభక్ష్య పరమాన్నాలు పెట్టనక్కర్లేదు. వారు మనం యేది పెడితే దానితో తృప్తి పడతారు.

కాబట్టి భక్తి ప్రధానం. మానవుడు యిదినాది, అదినాది అనుకుంటున్నారు. అసలు నీ దేహమే నీదికానప్పుడు, యేది నీది? నీది కానిదాని యందు నీదనే దృష్టిపెట్టుకోవటం చోరత్వం అవుతుంది. ఇది నా యిల్లు, నా డబ్బు, నా స్వంతం అంటారు. వెళ్ళి పోయేటప్పుడు వీటిల్లో యేది నీతో వస్తుంది? ఏదీరాదు. వచ్చేవి ఎత్తిపోతలే.

పుట్టటం పుట్టాం. వెళ్లటం ఖాయం. కాని యెలా వెళ్తామన్నది తెలియదు. అది యెవరి శాసనంలో వుంటుంది? భగవంతుడి నిర్ణయం మీద ఆధారపడి వుంటుంది. భగవంతుడు ఉత్కృష్టమైన మానవ జన్మని యిచ్చి తనను తాను గుర్తించమని అవకాశం యిచ్చాడు. కాని మనం యేం చేస్తున్నాము? మహాత్ములు చెప్పినవన్నీ పెడచెవిని పెట్టి, ఆకర్షణలకు లోబడి యీ దేహంలో వున్నది నేను కాదు అనే అసలు విషయాన్ని మరుస్తున్నాం, దుఃఖానికి లోనవుతున్నాము.

- సశేషం

# ఇంద్ర కీలాద్రి పై వెలసిన మహిషాసుర మర్దిని శ్రీ కనకదుర్గా మాత

- రమణ ప్రసాద్

పూర్వకాలంలో కీలుడు అనే యక్షుడు దుర్గని గురించి ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి, దుర్గాదేవి ప్రత్యక్షమై 'నీ తపస్సుకు మెచ్చాను. నీకు ఏ వరం కావాలో కోరుకో'అని అడిగింది. కీలుడు సంతోషించి, 'మాతా! నువ్వు ఎల్లప్పుడూ నా హృదయంలో నివసించి ఉండాలి అదే నా కోరిక' అన్నాడు. 'కుమారా! నువ్వు ఈ పవిత్ర కృష్ణా నదీ తీరాన పర్వత రూపం ధరించి ఉండు. కృతయుగంలో రాక్షస సంహారానంతరం నేను వచ్చి నీ హృదయ నివాసిన్నై వుంటాను' అన్నది దేవి.



ఆ ప్రకారంగా కీలుడు పర్వత రూపంలో కృష్ణానదీతీరాన వేచి వుండగా, శ్రీదుర్గామాత మహిషాసురుని సంహరించి ఆ పర్వతంపైన అష్ట భుజములతో మహిషాసుర మర్దినిగా వెలసింది. అనంత కోటి బంగారు కిరణాలతో ప్రకాశిస్తున్న ఆ దేవిని దేవతలందరూ కనకదుర్గ అని కొనియాడి ప్రతి నిత్యం పూజలు చేస్తున్నారు. అప్పటినుంచి ఆ పర్వతానికి 'ఇంద్ర కీలాద్రి' అని పేరు స్థిర పడింది. బంగారు వన్నెలతో మెరిసిపోతున్న ఆ పర్వతానికి 'కనకాచలము' అనే పేరు కూడా వచ్చింది. ఇంద్ర కీలాద్రి పరమ పవిత్ర పుణ్య క్షేత్రం అయింది.

బ్రహ్మదేవుడు, పరమ శివుడు ఈ పర్వతంపై కొలువై ఉండాలి అని తలచినవాడై శతాశ్వమేధయాగమును చేయగా, మహేశ్వరుడు ప్రసన్నుడై స్వయంభువుగా జ్యోతిర్లింగంగా వెలిశాడు. మొదటిసారిగా

బ్రహ్మదేవుడు మల్లెపూవులతో శివుడిని అర్చించాడు కనుక 'మల్లికేశుడు' అని పిలువబడుతున్నాడు.

ద్వాపర యుగంలో పాండవ మధ్యముడైన అర్జునుడు పాశుపతాస్త్రం కోసం పరమశివుని గలీరించి భీకరమైన తపస్సు చేయగా, శివుడు అతనిని పరీక్షింపదలచి అతనితో యుద్ధం చేశాడు. అతని భక్తికి, ధైర్య సాహసాలకు మెచ్చి అర్జునునికి పాశుపతాస్త్రాన్ని బహూకరించాడు. ఆనాటినుండి 'మల్లికేశ్వరుడు' అని పేరు వచ్చింది.

ఇలా కాలం గడిచిపోతూ, కలికాలం ప్రవేశించింది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులవారు యిక్కడికి వచ్చి, జ్యోతిర్లింగం మట్టిలో కూరుకుపోయి కనిపించని స్థితిలో ఉంటే కనకదుర్గ గుడికి ఉత్తరంవైపు మల్లేశ్వర స్వామిని పునః ప్రతిష్ఠించారు. అప్పటినుండి భక్తులు మల్లేశ్వరస్వామి వారిని భక్తి ప్రపత్తులతో పూజిస్తున్నారు. మల్లేశ్వరునికి దక్షిణ దిశగా కనకదర్గ అమ్మవారు భక్తుల పూజలందుకుంటున్నారు. ఆ విధంగా ఇంద్రకీలాద్రి 'కనకదుర్గ క్షేత్రం'గా ప్రసిద్ధి గాంచినది.

విజయవాడ నగరంలో స్థితమై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారు ప్రజలందరి ఆరాధ్యదైవమై అలలారుతోంది. ప్రతి సంవత్సరము ఎంతో వైభవంగా జరిగే 'నవరాత్రి' ఉత్సవాలకు లక్షలాది భక్తులు వచ్చి శ్రీ కనకదుర్గా మాతకు భక్తితో పూజలు చేస్తున్నారు.



# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

వారిలో పెద్ద మనుమరాలైన సీతారామాంజనేయాంబకు పోతునూరు గ్రామ వాస్తవ్యులైన కోడూరి అచ్యుతరామయ్యగారి కుమారుడితో కోటిపల్లిలో వివాహం జరిగింది. ఆ సమయంలో వారింటికి భిక్షకు వచ్చిన ఒక సాధువు యథాలాపంగా పెళ్ళి కుమారుని చెయ్యి చూశాడు. అతనే పెళ్ళికొడుకని తెలియకనో యేమోగాని, ఆ సాధువు అతనితో 'నీకు పదిహేడవయేట వివాహం జరుగుతుంది. ఆ భార్య ఒక సంవత్సరంలో గతిస్తుంది. నీకు ద్వితీయ వివాహం జరుగుతుంది' అని చెప్పాడు. పెళ్ళి కుమారుని తండ్రి అచ్చుత రామయ్య గారు 'ఈ గండం తప్పించగల సమర్థులు ఒక్కరే వున్నారు. ఆయన ఒక కుఱ్ఱ సాధువు. ఆయనను కోమటి సాధువు గారంటారు. వారు మా సమీప గ్రామమైన గుండుగొలను గ్రామానికి ఎక్కువగా వస్తూ వుంటారు. ఆయన ఎప్పుడు వచ్చినా రాత్రి 11గంటలు దాటాకే వస్తారు. మళ్ళీ తెల్లవారుజామున వెళ్ళిపోతారు. వారి దర్శనం దుర్లభం. కాని వచ్చే దసరాలకు ఆయన గుండుగొలనులోని గోపాలరాజుగారింట్లో శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు జరుపుతారని తెలిసింది. మనం వెళ్ళి ఆ సమయంలో వారిని ఆశ్రయిస్తే, యీ ముప్పు నుండి తప్పించుకో గలం' అని చెప్పారు.



ఆ ప్రకారంగానే 1948లో శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు జరుగుతున్నప్పుడు కోటిపల్లిమామ్మగారు, మనుమరాలిని వెంటబెట్టుకుని శ్రీబాబు దర్శనానికి గుండుగొలను వచ్చారు. ఆ రోజు శ్రీబాబు పూజ ముగించుకుని, భక్తులకు దర్శనం యివ్వటానికి వచ్చి కూర్చుని, "నా దర్శనం కోసం పోతునూరు నుండి ఒక మామ్మగారు, వారి మనుమరాలు వచ్చారు. వాళ్ళని పిలవండి" అన్నారు. మనం వచ్చినట్లు వారికెట్లా తెలిసిందా! అని ఆశ్చర్యపడుతూ వారిద్దరూ శ్రీబాబు దగ్గరకు

వచ్చారు. శ్రీబాబును చూస్తూనే మామ్మగారు అంతమంది జనంలోనూ తమ్ముతాము మరచిపోయి, ఆనందంతో ఊగిపోతూ, మనవరాలిని కుదిపేస్తూ 'ఒసేయ్ సీతారామాంజనేయం! అప్పుడు ధ్యానంలో ఒక కుర్రవాడిలాగా దర్శనమిచ్చిన నా రామచంద్ర ప్రభువు వీడేనే!' ఆ జనం మధ్యలో, శ్రీబాబు చెయ్యి పైకెత్తి చూపిస్తూ బిగ్గరగా కేక పెట్టారు. ఆమె మనుమరాలు హడలిపోయి చుట్టూ చూస్తూ మామ్మగారి నోరు చేత్తో మూసేస్తూ 'వీడు అంటావేమిటే' అని మామ్మగారి చెవిలో అన్నది.

శ్రీబాబు నవ్వుతూ "మా అమ్మమ్మా, నేనూ అలాగే మాట్లాడుకుంటాం ఫరవాలేదులే" అని, మామ్మగారితో "ఏం అమ్మమ్మా! మాట తప్పుతాననుకున్నావా? నన్ను గుర్తుపట్టావా?" అన్నారు.

మామ్మగారు లెంపలు వేసుకుంటూ నా రామచంద్రమూర్తిని నేను గుర్తుపట్టక పోవటమేమిటి? నిక్షేపంగా గుర్తుపట్టాను. కాని అప్పుడు నీ చేతిలో ఒక పుస్తకం చూశానే? అదేదో '........... వస్తు సుధా నిధి' అని పేరు చివరి సగం మాత్రం కనబడింది' అన్నారు. శ్రీబాబు "ఇదిగో! ఇదేగా! దీనిపేరు 'త్రిగుణాతీత వస్తు సుధానిధి" అంటూ ఒక పుస్తకం తీసి చూపించారు. మామ్మగారితో పాటు అందరూ ఆశ్చర్యపోయారు! ఆ పుస్తకాన్ని అంతకుముందు ఎవరూ బాబు దగ్గర చూడలేదు. మామ్మగారు ఆనంద బాష్పాలతో శ్రీబాబు పాదాలను అభిషేకించుకున్నారు.

శ్రీబాబు మామ్మగారితో "అమ్మమ్మా! ఏమిటి విశేషాలు?" అన్నారు. మామ్మగారు 'ఇది నా పెద్ద మనుమరాలు బాబూ .....'అంటుంటే శ్రీబాబు "దీనికి పెళ్ళైంది. ఇది చచ్చిపోతుందని, దీని మొగుడు రెండో పెళ్ళి చేసుకుంటాడని కోటిపల్లి సాధువు చెప్పాడు. అంతేగా? అదేమీ జరగదు. నీ మనుమరాలు మనవళ్లను, మునిమనవళ్ళను కూడా చూస్తుంది. దానితో రెండు మండలాలు గో దీక్ష, రెండు మండలాలు పుట్టదీక్ష, 108 ఆదివారాలూ, 108షష్ఠి తిథులు ఉపవాసాలు చేయించు. కోటిపల్లిలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో దీక్షలు చేయించు. ఆ స్వామి సర్ప రూపంలో అక్కడ స్వేచ్ఛగా తిరుగుతూ వుంటాడు. అయినా నీ మనుమరాలిని ఏమీ చేయడు. ముట్టుకున్నా, పట్టుకున్నా భయం లేదు. యే పామునూ, యెప్పుడూ చంపకండి, చంపించకండి, చంపుతుంటే చూడకండి. శ్రద్ధాభక్తులతో దీక్ష చేయించు" అని చెప్పి పంపించారు. శేషం

-గత సంచిక తరువాయి

## విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

భద్రాచలంలో శ్రీరామాలయం కట్టించిన భక్త రామదాసుకు తారకమంత్రం ఉపదేశించే సమయం వచ్చింది. శ్రీరాముని ఆజ్ఞ ప్రకారం తారక మంత్రోపదేశం కబీర్‌దాస్ చేయాల్సి ఉంది. కబీర్ కాశీలో ఉన్నాడు. రామదాసు భద్రాచలంలో ఉన్నాడు. శ్రీరాముని ఆజ్ఞ అయింది. కబీర్ శ్రీరామనామమనే విమానం ఎక్కి "చల్" అన్నాడు అంతే! మరుక్షణం భద్రాచలంలో రామదాసు ముందు ప్రత్యక్షం అయ్యాడు. కబీర్‌దాస్ రామదాసుకు ఒక పరీక్ష పెట్టాడు. "నువ్వు ప్రజలు కట్టించిన శిస్తులు వినియోగించి ఆలయం కట్టించావు. దీనిని మదర్సా (ముస్లిం బాల బాలికల పాఠశాల)గా మారిస్తే నీకు శిక్ష పడకుండా చేస్తాను." అన్నాడు కబీర్. "గురుదేవా! ఇంకా మీరు నన్ను పరీక్షిస్తున్నారా? ఒకసారి శ్రీరామునికి కైంకర్యం చేసిన రామాలయంలో మదర్సా పెట్టడమా? నా ప్రాణాన్నైనా ఇస్తాను కానీ నా రామభద్రుడికి ఎలాంటి అపకీర్తి రానీయను" అన్నాడు రామదాసు. కబీర్ అతడి భక్తికి ముగ్ధుడైనాడు.



కబీర్ ఇంటి ముందు ఒక వేశ్య ఉండేది. కబీర్ ఇంట్లో జరిగే సంకీర్తనలకు ప్రభావితురాలై వేశ్య ఇంటికి వెళ్ళిన విటులు వేశ్యను వదిలి కబీర్ ఇంట్లోని సంకీర్తనలో పాల్గొనేవారు. విటులు వెళ్ళిపోవటంతో వేశ్య క్రోధితురాలై కబీర్‌ను అక్కడి నుండి వెళ్ళగొట్టాలని పథకం పన్ని సుమంతుడు అనే వాడి ద్వారా కబీర్ సత్సంగం చేస్తున్న కుటీరాన్ని తగులపెట్టించింది. కానీ సత్సంగ మాధుర్యంలో ఓలలాడుతున్న భక్తులు బయటకు వచ్చి తమ సత్సంగాన్ని కొనసాగించారు. ఈ కుతంత్రాన్ని కబీర్ అయితే సహించాడు కాని కబీర్‌ను ప్రేమించే ఈశ్వరుడు సహించలేకపోయాడు. ఆయన లీలా విధానం చేత ఆ వేశ్య ఇంటికి నిప్పు అంటుకుని ఆమె ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. "కబీర్‌కు నేను

చేసిన అపకారానికి ఫలితంగా భగవంతుడు నన్ను ఈ విధంగా శిక్షించాడు అని గ్రహించి" నా ఇల్లు బూడిద అయింది అని మొర పెట్టుకుంది. కబీర్ "నీ హితైషి అయిన సుమంతుడు నా ఇల్లు తగల బెడితే, నా ప్రియమైన రాముడికి బాధ కలిగింది. అందుకే నీ ఇల్లు తగులబడింది" అన్నాడు. కాని ఆ వేశ్యకు వచ్చిన కష్టాన్ని చూడలేక తన భక్తులతో ఆ వేశ్యకు ఇల్లు కట్టించాడు. ఆమెలో పరివర్తన ఏర్పడింది. ఆమె కబీర్‌ను ఆశ్రయించి రామభక్త పరాయణురాలైంది.

కబీర్ ప్రజల దుస్థితికి ఏడ్చేవాడు.

దునియా కితనీ అజీబ్‌హై జోరంగీకో నారంగీ కహే ।

బనే బనే ధూధ్‌కో ఖోయా, చలతీకో గాడీ కహే దేఖ్ కబీరా రోయే॥

"ఈ ప్రపంచంలోని రీతులు ఎంత తారుమారుగా ఉన్నాయి? రంగు వస్తువులను నారంగీ అంటుంది. నారంగీ అంటే రంగు లేనిది అని అర్థం. పాలతో చేసిన దానిని ఖోయా అంటుంది. అంటే "కోల్పోయాను" అని అంటుంది. బండిని పట్టుకుని "గాడీ" అంటుంది. గాడి అంటే గుంట అని అర్థం. ఈ విపరీతాన్ని చూసి కబీర్ ఏడ్చేవాడు. నేటి ప్రపంచ రీతులను చూసి నవ్వేవాడు.

మెహె దేఖత ఆవే హసీ,పానీమే మీన్ పియాసీ ।

నీటితో మానవుల, జంతువుల, పశుపక్ష్యాదుల దాహం తీరుతుంది. కాని చెరువులో ఉంటున్న చేప దాహం తీరదు. అలాగే మానవుడు బ్రహ్మానందంలో వుండి కూడా తెలుసుకోలేకపోతున్నాడు.

కాశీలో పద్మనాభుడు అనే పుణ్యపురుషుడు ఉండేవాడు. ఆయనకు బ్రాహ్మణ జన్మ లభించింది. జ్ఞాన నిష్ఠా పరుడైన ఒక సద్గురువుని ఆశ్రయించి జన్మ చరితార్థం చేసుకోవాలి అనుకున్నాడు. ఆయన కబీర్‌ను ఆశ్రయించి ఉపదేశాన్ని గ్రహించి, గురుదేవుని అనుగ్రహంతో ఈషణత్రయాన్ని విడిచి, పరమ శాంతచిత్తుడై నిరంతర భగవద్ధ్యానంలో ఉన్నాడు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL